# ఆదర్శాలూ ఆచరణీయాలూ!

(బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగారు ఉపన్యసించిన రామాయణం, భాగవతం, శివమహాపురాణం మొదలగు పురాణాలలోని మంచి మాటలు, ఆచార వ్యవహారాలు, నడవడిక, నిత్యసూక్తులు, పాపపుణ్యాల ఫలితాలు, పూజాపద్ధతి మొదలగు విషయాల సుమాహారం)


సంకలనం

టి. నవీన్



శాంతా-వసంతా ట్రస్టు

ప్లాట్ నెం : 16 & 17, గ్రీన్ వాక్ వేస్,

రాజేంద్రనగర్, హైదరాబాద్

ఆదర్శాలూ - ఆచరణీయాలు !

**by : T.Naveen,**
**Hyderabad**
**email : naveentodupunoori@gmail.com**

ముద్రణ : **మే, 2014**

కవర్ డిజైన్ : జి.రాజేష్

ప్రచురణ : **శాంతా-వసంతా ట్రస్టు, హైదరాబాద్.**

ముద్రణ : **శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్**

ప్రతులకు :
**శాంతా వసంతా ట్రస్టు**
**ప్లాట్ నెం : 16 & 17,** గ్రీన్ వాక్ వేస్,
**బుద్వేల్, రాజేంద్రనగర్,**
**హైదరాబాద్**

# ఆదర్శాలూ - ఆచరణీయాలు !

(శ్రీరామయణ ప్రవచనాల నుండి)

1. జీవితంలో మనం ఏపని చేసినా, గురువుని తల్చుకోవడం కన్నా గొప్ప సత్కార్యం లేదు. అంత కన్నా మంగళకరమైన కార్యం లేదు.

* * *

2. ఎవరు అంధకారాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ఇస్తున్నాడో అతనే గురువు. గురువును ఎప్పడూ అవమానపరచడం కాని, అతని పట్ల అమర్యాదగా కాని ప్రవర్తించకూడదు.

* * *

3. ఎవరి గురించైనా మాట్లాడేటప్పడు మొట్టమొదట వారిలోవున్న మంచిని స్మరిస్తూ మాట్లాడితే ప్రశాంతత అలవాటు అవుతుంది.

* * *

4. ఎదుటివారు కోపంగా వున్నప్పడు వారితో మరింత కోపంగా మాట్లాడకుండా వారి కోపం తగ్గాక జరిగిన విషయాన్ని చెప్పి సమస్యను తీర్చాలి.

* * *

5. అతిథికి భోజనం వడ్డించేటప్పడు చులకనగా చూడకూడదు. రెండు చేతులతో వడ్డించకూడదు. మనం వారికన్నా అధికులమైనప్పటికీ అధికారము చూపకూడదు. సాధ్యమైనంత వరకు మాట్లాడకుండా మౌనంగా, చిరునవ్వుతో వడ్డన చెయ్యాలి. అతిథిని ఎప్పడూ అర్థాకలితో పంపించకూడదు. వారు తింటున్నప్పడు మనసులో పదార్థాలను అన్ని తినేస్తున్నాడని, గొణుక్కోవడం వంటివి చేస్తే వారిని అవమానించినట్టు అవుతుంది. దాని ఫలితం దక్కదు.

* * *

6. ఎడమ చేతితో, నిర్లక్ష్యంగా, అవమానిస్తూ దానం చేస్తే చేసిన యాజమాని నశించిపోతాడు. ఫలితం కూడా వుండదు.

* * *

7. నోటి మాట సున్నితంగా వుండాలి. మనం మాట్లాడేటప్పడు అవతలి వారిని ఉత్సాహ పరిచేవిధంగా వుండాలి కాని. బాధను గురిచేసే విధంగా వుండకూడదు.

* * *

8. తల్లిదండ్రులపట్ల కృతజ్ఞత లేనివారిని, చనిపోయిన తల్లిదండ్రులకు తద్దినం పెట్టనివారిని నమ్మడం కాని, స్నేహం చేయకపోవడం కాని మంచిది.

* * *

9. అష్టాక్షరి మంత్రం (ఓం నమో నారాయణ)లోని 'రా', పంచాక్షరి మంత్రం (ఓం నమఃశ్శివాయ)లోని 'మ' లను కలిపి 'రామ' అని తెలిసి కాని తెలియక కాని పలికితే మోక్షం వస్తుంది.

* * *

10. బ్రాహ్మణుడు నడవ వలసిన రీతిలో నడవకపోతే సమాజం భ్రష్టు పడుతుంది. ఎందుకంటే బ్రాహ్మణుని సమాజం ఆదర్శంగా తీసుకుంటుంది కనుక.

* * *

11. బిడ్డలను ఎక్కడపడితే అక్కడ ముద్దు పెట్టకూడదు. నుదిటిపైన మాత్రమే పెట్టాలి. అలా కాకుండా చేస్తే పాపం, చెడు లక్షణం.

* * *

12. ఎవడు మనుష్య శరీరంతో వచ్చిన తరువాత ఈ మనుష్య శరీరాన్ని భగవంతుని సేవకు వెచ్చిస్తాడో ఆ సేవకు వెచ్చించడంలో కూడా ఎంత సేవ చేసినా తనివి తీరక ఇంకా చెయ్యాలి ఇంకా చెయ్యాలన్న తపనతో, తాపత్రయంతో, భక్తితో చేస్తాడో అటువంటి వాడు శ్రీమాన్. వాడు గొప్ప లక్ష్మీవాన్. ఐశ్వర్యమంతా వాడిది.

* * *

13. గురువు పట్ల నీ విశ్వాసం నిన్ను బ్రతికిస్తుంది, నిన్ను రక్షిస్తుంది. నిన్ను ఉద్ధరిస్తుంది. నిన్ను సన్మార్గంలో నడిపిస్తుంది. గురువు యొక్క అనుగ్రహానికి పాత్రుణ్ణి చేస్తుంది.

* * *

14. భగవంతుని చేరకుండా అడ్డు వచ్చేది ప్రతిబంధక రూపమైన విఘ్నమే పాపం. పుణ్యకార్యం చేయకుండా అడ్డుకునే విఘ్నం కూడా ఒక పాప ఫలమే.

* * *

15. నిద్రపోయి లేచిన తరువాత స్నానం చేస్తే తప్ప దేవాలయానికి వెళ్ళకూడదు. అది పగటి పూట నిద్ర అయిన సరే. ఎందుకంటే నిద్రలో వున్నప్పుడు పంచేంద్రియాలు ముక్కు, చెవులు, కళ్ళు, నోరు వీటి అన్నింటిలోంచి మలినాలు విసర్జించబడుతాయి.

* * *

16. ఒక పుణ్యక్షేత్రానికి వెళ్ళినప్పుడు కూడా మనసు ఈశ్వరుని వైపుకు మళ్ళించక పోయినా, క్షేత్రం గురించి తెలుసుకోకపోయినా క్షేత్రానికి వెళ్ళిన పుణ్యం దక్కదు.

> అసూయ వున్నవాడు ఎదుటివారి మంచి లక్షణాన్ని చెడుకు అన్వయించి ప్రచారం చేస్తాడు.

17. పంచ మహాపాతకాలు (ఇవి చేస్తే బ్రహ్మ హత్యతో సమానం)

1. బ్రాహ్మణుని హత్య చేయడం

2. బంగారం దొంగిలించడం

3. సురాపానం (మద్యం సేవించడం) చేయడం

4. గురువుగారి మంచం మీద గురువుగారి భార్యతో పడుకున్నవాడు.

5. పై నాలుగు చేసినవాడితో స్నేహం చేయడం కూడా పంచ మహాపాతకంలో అయిదవది చేసినట్లు.

* * *

18. కీర్తి కండూతి : ఎవరయినా వచ్చినప్పుడు వారికి వినిపించేలా కాని, పక్కింటివారికి వినిపించేలా కాని, ఫోన్ వచ్చినప్పుడు సౌండ్ పెంచి పూజలు చేయడం, ఆర్భాటాలకోసం పూజలు చేయడం వీటిని కీర్తి కండూతి అంటారు. దీని వలన మనిషి పతనానికి కారణం అవుతుంది.

* * *

19. స్త్రీ కేశపాశం(జుట్టు) విరబోసుకుని దేవాలయానికి వెళ్ళకూడదు. తలస్నానం చేసిన తరువాత చివర ముడి లేకుండా విడవబడి వుంటే అందులోంచి సమస్తమైనటువంటి భూత, ప్రేతాలు వంటి శక్తులు లోపలికి ప్రవేశిస్తాయి. ఎట్టి పరిస్థితులలోనూ స్త్రీ యొక్క కేశపాశానికి చివర ముడి లేకుండా వుండకూడదని ధర్మశాస్త్రం చెబుతుంది.

* * *

20. ఎట్టి పరిస్థితులలోనూ స్త్రీ వివాహం అయిన తరువాత చెవికి కుండలం తీసి భర్తకు కనిపించకూడదు. ఏ కారణం చేతనైనా చెవికి పెట్టిన ఆభరణం తీస్తే భర్త కంటపడకుండా వెంటనే చెవిలో తాటంకాలు (తాటాకు ముక్క) పెట్టుకొని, ఆభరణం శుద్ధి చేసుకొని మళ్ళీ ఆభరణాలు ధరించినాకే భర్త ముందుకు రావాలి.

* * *

21. ఎట్టి పరిస్థితులలో ఎక్కడైనా కాని, టి.వి.లో కాని తాళి లాగుతున్న సన్నివేశం కనిపిస్తే తలమరల్చుకోవాలి. లేకపోతే భర్తలకు ఆపదలుగాని, కలసి రాకపోవడం గాని జరుగుతుంది.

* * *

22. భార్య నడవడి బట్టి భర్తకు ఐశ్వర్యం వస్తుంది. ఆమె నడవడి సరిగ్గాలేకపోతే అతని పతనానికి కారణం అవుతుంది. భార్య వుంటేనే ఏ పూజ అయినా, యజ్ఞాలైనా చేయగలం, ఆమె వల్లనే ఐశ్వర్యం నిలబడుతుంది. భార్య లేకపోవడం అష్టదరిద్రాలలోఒకటి.

* * *

23. ఏదైనా నిలబెట్టడానికి, కాపాడటానికి, దాన్ని వృద్ధి చేయాడానికి చాలా కాలం పడుతుంది. నాశనం చేయడానికి ఒక క్షణం చాలు.

* * *

24. రాజర్షి నుంచి ఋషి, ఋషి నుంచి మహర్షి, భక్తితో, తపస్సుతో ఇన్ని స్థాయిలు దాటితే బ్రహ్మర్షి అవుతారు.

* * *

25. కొందరు జీవితంలో తమ తప్పలు వలన ఎంత దెబ్బతిన్నా వారి అహం దెబ్బతినదు. నేను ఇంకా ఉన్నతస్థాయిలోనే వున్నాను అంటాడు. వాడికి ఎంత చెప్పినా వాడు మారడు. ఎన్ని చెప్పినా విని చివరకి ఒకే మాట అంటాడు అందులో నా తప్పలేదు అంటాడు కాని వాడి తప్ప ఒప్పకోడు.

* * *

26. మౌనవ్రతం చేసేవారు మౌనంగా మనసుతో ఈశ్వరుడిని కొలవాలి. సైగలు చేయడం సరి కాదు. మాట్లాడకుండా అన్ని పనులు చేయడం కాదు. దేని గురించి పట్టించుకోకుండా ప్రతిస్పందనను ఆపడమే మౌనం.

* * *

27. పెళ్లి సంబంధాలు చూసేటప్పడు వారికి ఎంత ధనం వుంది, ఎంత మంది పిల్లలు అని విచారించకుండా వారి యొక్క పూర్వ వృత్తాంతం ఏమిటి?. వారి నడవడి ఏమిటి?.ఆ కుటుంబ పెద్దల యొక్క ప్రవర్తన గురించి తెలుసుకోవాలి.

* * *

28. పెళ్లి చేసుకొని వచ్చిన కొత్త కోడలికి అత్తగారు తన ఇంటి కులదైవం గురించి, పూజగది గురించి, పూజావిధానం గురించి చెప్పాలి. అవే ఐశ్వర్యానికి, మంచి సంతానానికి కారణం అవుతాయి.

* * *

29. తమ్ముడి కూతురు/ కొడుకైనా అన్నగారే ఆ సంబంధం గురించి మాట్లాడాలి. ఎదురుగుండా పెళ్లికొడుకు, పెళ్లికొడుకు తండ్రి ఇద్దరు వుంటే కన్యాదాత మా అమ్మాయిని నువ్వు చేసుకోవయ్యా అనకూడదు. నువ్వు రావయ్యా చూడ్డానికి అనకూడదు. పెళ్లికొడుకు తండ్రిని మాత్రమే పిలవాలి. అయ్యా మీరు రండి మీ అబ్బాయిని తీసుకొని, మీరు మా అమ్మాయిని కోడలు చేసుకోండి అని చెప్పాలి అది పెద్దరికం.

దేవుడికి ఒక్క చేత్తో నమస్కారం పెట్టకూడదు. అలా చేస్తే తర్వాతి కాలంలో ఒంటి చేతివాడిని చేస్తాడు. అలాగే కాళ్లకు చెప్పలతోకాని, ఆలయ గడపను కాలితో తన్నిన మరుజన్మలో ఒక కాలును తీసివేస్తారు

30. నిశ్చితార్థంలో లగ్నపత్రికను పురోహితుల చేత చదివించకూడదు. కన్యాదాత తండ్రి పెద్దలందరిముందు లేచి చదివి వినిపించాలి అది పెద్దలను గౌరవించినట్లు. అది మర్యాద.

*　　*　　*

31. అడిగినా అడగకపోయినా కన్యాదాత వివాహసమయంలో పెద్దలకు తన వంశం గురించి ఒకసారి చెప్పాలి. విన్న పెద్దలు సంతోషిస్తారు.

*　　*　　*

32. పెళ్ళి సంబంధాలలో వుంటే తండ్రి లేకపోతే చిన్నవాడైన తన తమ్ముడితో ఆ విషయాలు పంచుకోవాలి లేదా పెళ్ళి విషయాలు మాట్లాడానికి వెళ్ళాలి.

*　　*　　*

33. ఒక ఇంటి వారి సంస్కారం ఏమిటో తెలియాలంటే మీరు ఆ యింటికి వెళ్ళినప్పుడు యింటి యజమానుల తల్లిదండ్రుల ఫోటోలు కనపడ లేదనుకోండి. ఇంటి యజమానుల తల్లిదండ్రుల ఫోటోలతో పాటు అత్త, మామగార్ల లేకపోతే వారి ఫోటోలు వుంటే తప్పేమీ కాదు. కాని తల్లిదండ్రుల ఫోటోలు లేకుండా అత్తమామల ఫోటోలు వుంటే వాడు నీచుడు. అటువంటి ఇంటితో ఎప్పడూ వియ్యం పొందకూడదు. ఆ యాజమానికి సంస్కారం లేదని అర్థం.

*　　*　　*

34. నిద్ర లేవగానే తల్లిదండ్రులకు నమస్కరించడం. ప్రతి మంచి విషయాన్ని వారితో పంచుకోవడం, వారు జీవించిలేకపోయినట్లైతే వారి ఫోటోలతో చెప్పాలి. వివాహ సంబంధం కుదిరినాక ఫోటోల దగ్గర మీ మనవడికి ఇలాంటి సంబంధం కుదుర్చుకున్నామని వారికి వధువు ఇంటి వారి యొక్క విషయాలు చెప్పాలి.

*　　*　　*

## కలి యొక్క ప్రభావం ఉండే పరిసరాలు

1. జూదశాల　2 .పానశాల

3. స్వేచ్ఛా విహారిణులై ధర్మానికి కట్టుబడకుండా ప్రవర్తించే స్త్రీలు, జీవహింస జరిగే పరిసరాలు.

4. బంగారంపై మోజు, అధికంగా ధరించుట.

వీటి వల్ల నిత్యం ఇంట్లో ప్రశాంతత వుండదు, నిత్యం పోట్లాటలు, లక్ష్మీకటాక్షం వుండదు. దరిద్రం తాండవం చేస్తుంది, ఆశలు, కోరికలు బాగా పెరుగుతాయి.

35. ఓర్పుతో ఎప్పుడూ చిరునవ్వుతో వుండే స్త్రీ అసలైన ఐశ్వర్యం గల స్త్రీ.

* * *

36. కార్తికమాసంలో వేడి నీటితో స్నానం చేయడం తప్పేమీకాదు. శాస్త్రం దానికి మినహాయింపు ఇచ్చింది.

* * *

37. పుట్టుక చేతనే పనికిమాలిన కన్ను వుండవచ్చు, ఒక వ్యక్తికి పుట్టుకచేతనే వినలేని చెవి వుండవచ్చు. చూడలేని కన్ను వుండవచ్చు. పుట్టుకతో ఏ వ్యక్తి మనసు చెడ్డది కాదు. మారే స్వభావం మనసుకు వున్నది. మారని స్వభావం శరీర అవయవానికి వున్నది. అవతలివారి గురించి మనం అలోచించే విధానాన్ని బట్టి మనసు మారుతుంది. మనసు ప్రశాంతంగా వుంటే అన్ని మనకు మంచిగానే కనిపిస్తాయి.

* * *

38. ఎన్ని సంకల్పాల్లో నువ్వు ఇతరులను ద్వేషిస్తే అంతసేపు నువ్వు చెడ్డమనసుతో వున్నట్లు, ఎన్ని సంకల్పాల్లో ఇతరులు చేసిన మంచిని నువ్వు స్మరిస్తే అంతసేపు నువ్వు మంచిమనసుతో వున్నట్లు. ఎంత మంచి మనసుతో వున్నావో అంతా ప్రశాంతంగా వున్నట్లు ఎంత ప్రశాంతంగా వుంటావో అన్నీ మంచి మాటలు వస్తాయి.

* * *

39. పూర్వభాషి అంటే ఇతరులు మనల్ని పలకరించటం కంటే ముందే వారిని పలకరించడం, వారితో ప్రియంగా మాట్లాడటం, వారి క్షేమాన్ని కోరడం అలవాటు చేసుకుంటే అహంకారాన్ని జయించినట్లే.

* * *

40. అధర్మంగా వచ్చిన సంపాదనతో పాటు అశాంతి అనారోగ్యాలు వస్తాయి. అధర్మంగా వచ్చిన సంపాదన అధర్మంతోనే బయటకువెళుతుంది.

* * *

41. సంపాదన న్యాయబద్ధం అయివుండాలి. వ్యయం (ఖర్చు) న్యాయబద్ధం అయివుండాలి. ఎందుచేత అంటే తనకు కావలసినంత ఖర్చు పెట్టుకోకండా బ్రతికినట్లయితే వాడు తనకి తాను ద్రోహం చేసుకున్నట్లు, తనకు కావలసిన దానికన్న ఎక్కువ ఖర్చు పెట్టుకున్నవాడు భావితరాలకు ద్రోహం చేసినట్లు, ఈ రెండింటికి ద్రోహం చేయకుండా సమతుల్యంగా ఖర్చుపెట్టడం నేర్చుకోవాలి.

* * *

42. ప్రేమ అన్నమాటకు అర్థం, తాను అనుభవించడానికి తగిన యోగ్యత లేకపోయినా, తాను అనుభవించకపోయినా తనవారు అనుభవిస్తే, వారు అనుభవిస్తున్నటువంటి ఆనందాన్ని చూసి తాను ఆనందించగలగడం ప్రేమ.

* * *

43. అన్నం మానేయడం ఉపవాసం కాదు ఆశనం. నువ్వు ఒక జన్మలో వేరొకరికి పెట్టలేదు కనుక ఈ జన్మలో ఆ దరిద్రం అనుభవిస్తున్నావు. కడుపు నిండా తింటే కన్ను మూతపడుతుంది కాబట్టి. కన్ను మూతపడి పోనంత సాత్విక పదార్థం శరీరం నిలబడడానికి కావలసినంత ఈశ్వర అనుగ్రహంగా తిని, ఆ ఓపికతో భగవదారాధన చేయడం ఉపవాసం. ఉప అంటే సమీపముగా, వాసి అంటే నివసించుట అంటే ఈశ్వరాధనతో నివసించటం అని అర్థం.

* * *

44. అసూయతో చెప్పేటివారిని పక్కన చేర్చుకొని, అసూయతో మాట్లాడుతున్నప్పుడు వారి మాటలను మధ్యలో తుంచి, బయటకు పంపకుండా పోనీలే అని వారిని ఉపేక్షిస్తే వచ్చే ప్రమాదం చాలా భయంకరంగా వుంటుంది.

* * *

45. భర్త బయటకు వెళుతుండగా భార్య ఎదురు రాకూడదు. అలా వస్తే అమంగళకరమైన చర్య అవుతుంది.

* * *

46. సామాన్య మానవునికే కాదు. జ్ఞానికి కూడా కష్టాలువుంటాయి. కాకపోతే కష్టం వచ్చినప్పుడు ఏ జన్మలోనో చేసిన పొరపాటును దేవుడు ఈ చిన్న కష్టంతో తీసేస్తున్నాడు అనుకుంటాడు. అలాగే సుఖం వచ్చినప్పుడు ఈశ్వర కృప అనుకుంటాడు. రెండింటిలోనూ దైవాన్ని చూస్తారు.

* * *

47. భార్యకు గౌరవం ఎప్పుడెప్పుడు వస్తుందంటే భర్తకు అణిగివున్నప్పుడు, భర్తకు సలహా చెప్పినప్పుడు, భర్త చెప్పిన పని చేసినప్పుడు, భార్య పని భర్త చేయలేదని గొణుక్కునప్పుడు భార్య గౌరవనీయురాలు కాదు.

* * *

48. సు:ఖమవని, దు:ఖమవని, శుభమవని, అశుభమవని ఏదైనాకాని వెనుక నుండి శాసించే వాడు దైవం. అ దైవాన్ని తిరస్కరించి నువ్వేమి చేయలేవు. అందుకే భగవంతుడి సంకల్పంగా మనం నడవాలి.

* * *

49. ఏ స్త్రీ భర్తని విడిచిపెట్టి తనొక్కతే వేరుగా, భర్తకు దూరంగా వుంటానని మానసికంగా ఊహిస్తుందో అటువంటి స్త్రీని వృషం(జంతువు)తో సమానం. అటువంటి స్త్రీ పేరు కూడా పలకరాదు.

* * *

50. మీకు ఎన్ని కోట్ల రూపాయల ఆస్తులు వున్నాగాని దానిని శాస్త్రము అర్థము(సంపాదన) అని అంగీకరించదు. దానికి శాస్త్రములో పేరు కర్మ ఫలము. ఇంతకుముందు మీరు పుణ్యము చేసి వుంటారు. ఆ పుణ్యము ఈ జన్మలో నాలుగు రూపాయలు కనిపించేలా చేస్తుంది. అందుకని గృహములు కాని, పొలములు కాని, భూమికాని, గనులుకాని, ద్రవ్యంకాని, వాహనములు కాని, ఇవేమి అర్థము కాదు. అర్థము అంటే కొడుకు. ఎందుకంటే ఎంత కష్టంలో మీరు వున్నా సరే కొడుకును చూసినా, కొడుకు గురించి చెప్పినా తండ్రికి ఆనందాన్నిస్తుంది. తండ్రి శరీరం పడిపోయిన తర్వాత తండ్రిని ఉత్తమలోకాలకు పంపించేశక్తి కొడుకుకు ఒక్కడికే వుంది. గయశార్థం పెడతాడు. అందుకని అర్థము అంటే కుమారుడు.

* * *

51. భర్త మనసెరిగి, భర్తకు ఆనందం కలగనటువంటి పనులు చేసిన స్త్రీ, మిగిలిన ఎన్ని పుణ్యకార్యాలు చేసినా చిట్టచివర ఆమె నరకాన్ని మాత్రమే పొందుతుంది.

* * *

52. మనం బ్రతికుండాలని కోరుకునేవారు, మన కీర్తిని, యశస్సుని కాంక్షించే వారు లోకంలో చాలామంది వుంటే. మన పేరు చెప్పగానే ఆయన చాలా కాలం బతకాలని కోరుకుంటే ఉపద్రవాలు, ప్రమాదాలు తప్పతాయి. ఈ జన్మకు సార్థకత.

* * *

53. ఏ పుణ్యక్షేత్రానికి వెళ్ళినా మనం తప్పకుండా కోరవలసినది 'స్వామీ! నాకు పునర్దర్శనం కటాక్షించు' అని అడగాలి. అది మొక్కు కాదు. అది తప్పకాదు. ఎన్ని సార్లు దైవదర్శనం అయితే అంత ఆయుష్షు కలుగుతుంది.

* * *

54. ఒకరి ఇంటికి వెళ్ళినప్పుడు నీవు వారిచ్చినది పుచ్చుకోవాలి అది మర్యాద. ఒకవేళ నువ్వు తినలేకపోతే వారిచ్చిన పదార్థం మీద కుడిచేయి ఆన్చి, దానికి గల కారణం చెప్పి. ఆ ప్లేట్ తీసుకుని లేచి లోపల పెట్టి వెళ్ళాలి తప్ప వారిచ్చినప్పడు నేను తినను, తినను అనకూడదు అది మర్యాద కాదు.

* * *

55. వాస్తు హోమం చేయకుండా గృహ ప్రవేశం చేస్తే ఇంటి యజమానికి ఆయుష్షు తగ్గుతుంది. ప్రమాదాలు వస్తాయి.

* * *

56. తెల్లవారు ఝామున, నిద్రలేచేముందు వచ్చే కలలు నిజమవుతాయి. అయితే ఆదే ఆలోచన మీదకాని, సమస్య మీదే ఊహించుకుంటూ నిద్రపోతే వచ్చిన కలలు ఫలించవు.

57. జీవితంలో చేయకూడని పాపాలు

(శాస్త్రంలో చెప్పబడిన భయంకరమైన పాపాలు)

౧. గురువులచేత అన్ని విద్యలు నేర్చుకుని ఆచరించక, కృతజ్ఞత చూపకపోవడం.

౨. నిద్రపోతున్న ఆవును కాని, ఎద్దును కాని కాలితో తన్నడం.

౩. సేవకులతోటి చాలా కష్టమైన పని చేయించుకుని ఆ పనికి తగ్గ వేతనం ఇవ్వకపోవడం.

౪. ఇంట్లో అనుకూలవతియైన భార్యవుండగా, పరస్త్రీలతో క్రీడించడం.

౫. ఇంట్లో సేవకులు, తల్లిదండ్రులు, భార్య, పిల్లలు ఇంతమంది వుండగా తానొక్కడే మధుర పదార్థాలు మిగిలిన వారికి పెట్టకుండా తాను తినడం.

౬. అందరు త్రాగేనీటిలో విషం కలపడం.

౭. యుక్తవయస్సు వచ్చాక కూడా వివాహం చేసుకోకుండా వంశాభివృద్ధి చేయక, పితృరుణాన్ని తీర్చకపోవడం.

౮. పాలకులు వసూలు చేసిన పన్నును తిరిగి ప్రజలకు ఖర్చు చేయకుండా ఉండటం.

౯. కొత్తగా ఈనినటువంటి పశువు యొక్క దూడ మళ్ళీ వచ్చి పాలు త్రాగడానికి పశువు యొక్క పొదుగులో కావల్సిన పాలను వుంచకుండా మొత్తం పాలను పిండి జున్ను వండుకున్నవాడికి. ఆ జున్నును ఎవరు తిన్నా వారికి పాపం.

౧౦. సూర్యునికి ఎదురుగా నిలబడి మలమూత్రములు విసర్జించడం.

* * *

58. భర్త పూజలు చేయకపోతే ఆయనకు పుణ్యం దక్కదు. కాని భార్య ఎటువంటి పూజలు చేయకుండా భర్తకు సేవలు చేస్తే ఈశ్వర సేవలుగా గుర్తించి ఆ పుణ్యాన్ని ఆవిడ ఖాతాలో వేస్తారు. భర్త ఒకవేళ పుణ్యకార్యాలు, పూజలు చేస్తే అందులో సగం పుణ్యంకూడా భార్య ఖాతాలో వేస్తారు. భార్య చేసిన పూజలు, పుణ్యకార్యాల ఫలం భర్తకు చెందదు. అలాగే భర్తను వదిలేసి ఎన్ని పుణ్యకార్యాలు చేసిన వాటి ఫలితం శూన్యమే.

* * *

59. తండ్రిగారు ప్రాణం విడిచి వెళ్ళాక ఒక సంవత్సరం పాటు పీటల మీద కూర్చోకూడదు. ఆ సంవత్సరం పాటు కొడుకు చేసిన పుణ్యకార్యాల యొక్క పుణ్యం తండ్రిగారికి వెళ్తుంది. అందుకని ఆ సమయంలో పుణ్యకార్యాలు, దానాలు చేయాలి. గయాక్షేత్రం వెళ్ళి పిండం పెట్టాలి. అలా పెట్టనివాడు పుత్రుడే కాడు. అటువంటి వాడిని కొడుకు అని పిలువదు శాస్త్రం.

* * *

60. కామ, క్రోధములను హరించి, దుఃఖములు తొలగించి మళ్ళీ శాంతిని ఇయ్యగలవాడే మంచి మిత్రుడు.

* * *

61. తడికాళ్ళతో రాత్రి పడుకో కూడదు. కాళ్ళు తుడుచుకొని పడుకోవాలి.

* * *

62. ఏ యింటిలో సీత, సీత అని వినిపిస్తుందో అ యింటికి లక్ష్మీకటాక్షం కలుగుతుంది.

* * *

63. భార్యాభర్తలు నిలిచివున్నప్పడు వారి మధ్యలోంచి ఎప్పడూ నడిచి వెళ్ళకూడదు.

* * *

64. కుటుంబంతో పాటు బయటకి వెళ్ళినప్పడు ముందుగా ఇంటి యజమాని, తర్వాత పురుషులు, వారి తర్వాత చివర స్త్రీలు నడవాలి. అలా నడవకపోతే ఇంటి పెద్ద చనిపోతే ధర్మోదకాలు ఇవ్వడానికి వెళ్ళినట్టు గుర్తు. అది దారుణమైన నడక.

* * *

65. అన్నం తినేటప్పడు ఒక్క ముద్ద కలిపి పక్కన పెట్టరాదు. అలా పెడితే అది తద్దినంతో సమానం. సాధ్యమైనంత వరకు అరచేతికి అంటకుండా భోజనం చేయాలి.

* * *

## లక్ష్మీ దేవి స్థిరనివాసం

01. తులసి చెట్టు ఎండకుండా చూడటం, ఎండిపోతునట్టు అనిపిస్తే వెంటనే తులసి చెట్టు మార్చాలి.

02. తరచు బ్రాహ్మణసేవ చేయాలి.

03. కారణం లేకుండా పగటిపూట ఎక్కువసేపు నిద్రపోకూడదు.

04. జీవహింస జరిగే స్థలంనుంచి (అకారణం చేత చెట్టు కొమ్మలు విరవకూడదు) వెంటనే తిరిగివెళ్ళిపోతుంది.

05. పెళ్లైన స్త్రీలు పాపట ప్రారంభస్థానంలో సింధూరం కాని, బొట్టు కాని పెట్టుకోవాలి. అలా పెట్టుకోకుండా వుండకూడదు. అది లక్ష్మీ స్థానం. శుభాలు కలుగుతాయి. లేకపోతే భర్తలకు కలసిరాదు.

66. తద్దినం పెట్టేటప్పుడు నువ్వురోజూ ఏమి తింటావో అవే పెట్టాలి. మా తండ్రిగారికి  ఈ పదార్థాలు అంటే ఇష్టమని అవి తయారుచేయించి పెట్టకూడదు. అలా పెట్టకూడదనే శాస్త్రంలో వుంది.

*         *         *

67. తద్దినం పెట్టేటప్పుడు సాధ్యమైనంత వరకు అన్నదమ్ములు కలిసిపెట్టాలి. పైన చిన్నవాడి చేతిలోంచి నీరుపోసి అవి పెద్దవాడి చేతిలోకి జారి వెళ్ళాలి. అలా చేస్తే పితృదేవతలు సంతోషిస్తారు.

*         *         *

68. పిల్లలకు ఏదో విధంగా భక్తి, దైవం గురించి చెప్పాలి. వారికి అలవాటయ్యేలా చూడాలి.

*         *         *

69. పెళ్లైన తర్వాత మగవాళ్ళు ఎప్పుడూ పేరుకు ముందు 'శ్రీ'ని చేర్చి రాయాలి. అలా రాస్తే అతను గృహస్త్రాశమంలో వున్నట్లు అర్థం అది సంప్రదాయం. అది కీర్తి కండూతి కోసం చేసే పని కాదు. అది ధర్మం.

*         *         *

70. మహా పతివత్రలైన స్త్రీలు సాధించనదంటూ ఏదీ లేదు. సతి అనసూయ పదిరాత్రులను కలిపి ఒక రాత్రి చేసింది. దేశంలో క్షామం వస్తే ఒక నదిని సృష్టించింది. త్రిమూర్తులను పసిపిల్లలుగా లాలించింది.  ఆ ముగ్గురు అంశతో దత్తాత్రేయను తన కొడుకుగా పొందింది.

*         *         *

71. తన యింట్లో తండ్రిగారు నిత్యపూజలు చేసుకునే మహాభక్తుడయి వుంటే, ఆయన తన మెడలో రుద్రాక్షమాల, తామరపూసల మాలవేసుకొని ఈశ్వరుణ్ణి సేవించి పూజమందిరం నుంచి బయటకు వస్తూండగా ఆయనను బిడ్డలు కాని, భార్యకాని చూసారంటే వారికి త్రివేణి సంగమంలో స్నానం చేసిన ఫలితాన్ని వారి ఖాతాలో వేస్తారు. అందుకే యింటి యజమానిని బట్టి ఇల్లు వుంటుంది. వారి ప్రవర్తనే తర్వాతి తరానికి వస్తుంది.

*         *         *

72. ఎవ్వరి జోలికి వెళ్ళకుండా ప్రశాంతంగా తన మానాన తన పనిచేసుకునేటువంటి వాణ్ణి చూసి, ఈశ్వర కృత్యమునందు తాను లయమైన వాణ్ణి చూసి వాడికి పేరుపెట్టి, వాడిని పస్తుపెట్టి, వేధించి, హింసించి, వాడి మనసును గాయపరచేటువంటి ప్రయత్నం ఎవడు చేస్తాడో వాడిది రాక్షసాంశ.

*         *         *

73. ఎప్పుడైనా చేతిలో కర్ర, కత్తిలాంటి ఆయుధాలు పట్టుకొని తిరిగితే, ఏకారణం లేకుండా, మనపట్ల అవతలవారు ఏ వైరం చేయకుండా, వైరం లేకుండా, తగినంత కారణం లేకుండా అవతలి వారిని హింసించాలనే కోరిక పుడుతుంది. వారిని బాధపెట్టాలనిపిస్తుంది. అది దోషం.

*    *    *

74. ఒకనాడు ఈ జీవుడు తల్లిగర్భంలో పడివుంటాడు. పడివున్నప్పుడు గమ్మత్తుగా తల క్రిందికి, కాళ్ళు పైకి వుంటాయి. అమ్మ కడుపులో అంతా చీకటిగా వుంటుంది. ఈ జీవి పెరుగుతూ మెల్ల మెల్లగా జీవికి కాళ్ళు, చేతులు వస్తాయి. అమ్మ గర్భంలో వున్న చోటనే ఇరుక్కుని కూర్చొంటాడు. తల చేతులు ముడుచుకుని పడివుంటాడు. తాను విసర్జించిన మల మూత్రాలు తనపైనే పడుతుంటాయి. పొరపాటున అమ్మ తినకూడని వస్తువు తిని దాని వలన జీవికి జలుబు  అయితే ఆ వచ్చిన తెమడ దానిమీద పడుతుంది. పడితే కంపు, లోపలంతా సహజంగా పులిసిపోయిన కంపుతో వుంటుంది కడుపు. ఈ కంపులో పడివున్న జీవి ఈశ్వరుణ్ణి ప్రార్థన చేస్తాడు. ఈశ్వరా! నాకు ఎన్ని శరీరాలు ఇచ్చావో ఇచ్చిన శరీరాలతో బయటకు వెళ్ళినప్పుడల్లా సంసార వ్యామోహాలకు గురి అయిపోయాను. నాది అన్న స్వార్థంలో సంపాందించాను. ఈశ్వర కార్యాలను వదిలేసాను. మళ్ళీ ఆ శరీరాన్ని వదిలేసాను. ఎన్నో రకరకాల జన్మలెత్తి, ఎత్తి, ఏదో జన్మ పుణ్యం వల్ల మళ్ళీ ఇన్నాళ్ళకు అమ్మ కడుపులో మనుష్య శరీరంతో వున్నాను. కాని ఇది బయటకు వెడితే కదా పుణ్యం చేసుకోవడానికి, ఈశ్వరా, ఇక్కడ నలిగిపోతున్నాను. తట్టుకోలేకపోతున్నాను, నన్ను బయటకు తోసేయవయ్యా పరమాత్మా అని అడుగుతాడు. ఆ చీకటిలోంచి ప్రసూతి వాయువై అమ్మలోంచి బయటకు తోసేస్తాడు పరమాత్మ, బయటకు రాగానే శటము అనే వాయువు వచ్చి పట్టుకుంటుంది. అది పట్టుకోగానే గతజన్మస్మృతి మరచిపోతారు. మరిచి పోయి శరీరంపై, భోగాలు, సంపాదనల మోజు పెరుగుతుంది. దాని నుంచి తల్లిదండ్రులు, గురువులు మనసును ఈశ్వరునివైపు తిరిగేలా చూడాలి.

*    *    *

75. చిన్నపిల్లల కడుపుపైన చేతితో రాస్తూ 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' అని అంటూవుంటే ఎటువంటి పదార్థమైనా వారికి జీర్ణం అవుతుంది. ఇది అగస్త్య మహర్షి పెట్టిన భిక్ష

*    *    *

76. పూజగదిలో పూజచేయకుండా పొద్దున్న హడావిడిగా తువ్వాలు కట్టుకుని అగరవత్తులు పట్టుకొని తిప్పేవాడు పొందే ఫలితం ఎలా వుంటుందంటే, అబద్ధం సాక్ష్యం చెప్పినవాడు ఎలా బతుకుతాడో అలా యమలోకానికి వెళ్ళిన తర్వాత తన మాంసము పీక్కొని తననే తినమంటారట.

77. ఎప్పుడూ మన మనసుకు ఇష్టమయేటట్లు మాట్లాడేవారు చాలా మంది దొరుకుతారు. కాని వాళ్ళు మిమ్మల్ని అభ్యున్నతి వైపు నడిపించేటట్టుగా మాట్లాడేవారుకారు. ఎందుకంటే మీ దగ్గర పబ్బం గడుపుకోవాలి. అందుకని మిమ్మల్ని పొగిడి మాత్రమే మాట్లాడుతారు. ఒక్కొక్కరు మాట్లాడితే అప్రియంగా వుంటుంది. కాని ఆ మాట్లాడే మాటల్లో అవతలి వారియొక్క అభ్యున్నతి గురించిన మాటలుంటాయి. అలా మాట్లాడేవాడు జీవితంలో దొరకడు. ఒకవేళ మంచి చెప్పేవాడు దొరికినా వినేవాడు దొరకడు.

* * *

78. ఒకపూట తిన్న ఆహారం బాగా లేకపోతే ఒకరోజు వృధా అవుతుంది. భార్య మంచిది కాకపోతే జీవితమే నాశనమవుతుంది. కొడుకు మంచివాడు కాకపోతే వంశమే నాశనమవుతుంది. సరియైన స్నేహితుణ్ణి ఎంచుకోకపోతే జీవితంలో సుఖమన్నదే వుండదు.

* * *

79. ఒక స్త్రీని భర్త పక్కన లేనప్పుడు నిష్కారణంగా పొగిడిన వాడితో చాలా జాగ్రత్తగా వుండమని చెప్పింది శాస్త్రం.

* * *

80. పెళ్లిలో పెద్దలు ఈ మాటలు చెప్పాలి, వధువుతో 'ఎప్పడూ నీ భర్త గురించి ఇంకో మనిషి దగ్గర మాట్లాడకూడదు'. వరుడితో 'నీ భార్య దగ్గర నేరం వేరొకరు ఎప్పడూ వినకూడదు'. ఎన్నడూ దంపతుల కలహంలో మూడోవాడు జోక్యం చేసుకోకూడదు. అది వారిద్దరే తీర్చుకోవాలి. వేరొకరు కలుగ చేసుకుంటే అంతకన్నా దుర్దినమైన రోజు ఉండదు.

* * *

81. శరీరంలో వుండే ఓపిక దగ్గర నుండి మనకుండే ఐశ్వర్యం వరకు పరమేశ్వరుడు కాలస్వరూపంతో తీసేస్తాడు. వాడు తప్పలు చేస్తున్నా వాడికి ఐశ్వర్యాభివృద్ధి కలుగుతుంది కదా అని నేనెందుకు తప్ప చేయకూడదు అనుకోకూడదు. వాడికి పూర్వజన్మలో కాని ఈ జన్మలో కాని తెలియక కాని తెలిసికాని చేసిన పుణ్యఫలం వాడిని రక్షిస్తుంది. అది అయిపోయిందా కరి మింగిన వెలగపండులా వాడి ఐశ్వర్యం అంతమయిపోతుంది.

* * *

82. ఈ భూమండలంలోనే మన సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి. దానిని విడిచి పాశ్చాత్య సంస్కృతిని ఆచరించడమంటే అగ్నిని కౌగిలించుకున్నట్లే.

* * *

83. ఎంత గొప్పవాడుకాని, జ్ఞాని అయినా వాళ్ళకు కష్టాలు తప్పవు. కష్టాన్ని అనుభవించని మానవుడు వుండడు. అందుకే ధర్మాచారంలో వున్న కష్టాలు తట్టుకోవడానికి, ధైర్యం కోసం మహాత్ముల చరిత్రలు చదవాలి. వారు అవలంబించిన మార్గాలను తెలుసుకోవాలి.

* * *

84. నువ్వు తెలియక చేస్తే తప్పు, ప్రాయశ్చిత్తంచేత మన్నింపబడుతుంది. నేను ఇంత తప్పు చేసానురా అని బాధపడుతుంటే, మరోసారి ఈ పాపపు పనిని మళ్ళీ చేయకూడదని నిర్ణయించుకుంటే ఈశ్వరానుగ్రహం నీకు కలుగుతుంది. ఆ తప్పుకు పాప ఫలితం తగ్గుతుంది.

* * *

85. జీవితంలో ఒక మిత్రుడిని ఎంచుకోవాలి. ప్రతివాడు మిత్రుడు కాడు. నువ్వు దుఃఖంలో, బాధలో వున్నప్పుడు, నిన్ను ఒడ్డుకు చేర్చగలిగినవాడు, నీ హృదయం తెలుసుకున్నవాడు, మాటల నైపుణ్యమున్నవాడు, ఎప్పుడు ఏది మాట్లాడాలో తెలిసివున్నవాడు, ధర్మమున్నవాడు అటువంటి వాడిని మిత్రుడిగా చేసుకోవాలి.

* * *

86. ఎంతగొప్పవాడైనా కాని, ఎంత జ్ఞాని అయినా సరే, సన్యాసి కనిపించగానే వెంటనే లేచి నమస్కరించాలి. ఎందుకంటే మనం ఏది విడిచి పెట్టలేక పోతున్నామో వారు ఆ సంసారాన్ని విడిచి పెట్టారు కనుక.

## నమస్కారం చేసే విధానం

నమస్కారం ఎలా పడితే అలా ఇష్టమొచ్చినట్లు చేయకూడదు. తల్లిదండ్రుల దగ్గరకు వెళితే నేలమీద పడి ఒక్కటే నమస్కారం చెయ్యాలి. తల్లిదండ్రుల దగ్గర నమస్కారం చేసేప్పుడు ఎప్పుడూ నీ కోరికను అడగరాదు. అది శాస్త్రమందు నిషిద్ధం. భగవంతుడి దగ్గరకు వెళ్ళినప్పుడు మూడుసార్లు సాష్టాంగ నమస్కారం చెయ్యాలి. సాష్టాంగ నమస్కారం చేసేప్పుడు ఒక సారి కింద పడి మళ్ళీ మొకాళ్ళ వరకు లేచి మళ్ళీ కిందపడి అలా మూడుసార్లు నమస్కారం చెయ్యాలి. కమండలం పట్టుకున్న సన్యాసి దగ్గరకు వెళితే నాలుగుసార్లు నేలమీద పడి నమస్కారం చెయ్యాలి. సన్యాసికి నమస్కరించేప్పుడు నిశ్శబ్దంగా చేయకూడదు. ప్రతి నమస్కారానికి నాలుగు సార్లు నమోః నారాయణః అని చెయ్యాలి. స్త్రీలు నేలమీద పడి నమస్కారం చేయకూడదు.

87. హనుమంతుడికి ఉపాసనచేసి, నమస్కారం చేసినవారికి బుద్ధి, ఆరోగ్యం, వాక్‌పటుత్వం, యశస్సు, బలం, ధైర్యం, అజాడ్యం ఇవన్నీ కూడా ఏకకాలంలో సంభవిస్తాయి. మనకు భయమువేసినప్పుడు కాని, హనుమంతుడికి ఉపాసనం చేసేటప్పుడు విగ్రహం లేకపోయినా 'హనుమ' అని చేతితో రాసి మ్రొక్కిన ఫలితం వస్తుంది.

* * *

88. గాలి ఒక పువ్వునుంచి వెళితే ఎంత బాగుంటుందో, అదే గాలి కుళ్ళిపోయిన కుక్క శరీరం నుంచి వస్తే భరించలేం. అది గాలి దోషము కాదు. అది చేసిన స్నేహం యొక్క ఫలితం, అలాగే స్నేహం చేసేటప్పుడు మనం మంచివాడిని ఎంచుకుని స్నేహం చేయాలి.

* * *

89. ఎంత చిన్న విషయానికైనా సరే ప్రతిస్పందించగలిగిన మనసుండడం ఒక రకంగా పాపమే. అంత తొందరగా ప్రతి విషయానికి ప్రతిస్పందించిపోయి ఎత్తు పల్లాలు చూసే మనసు ఒక వయస్సు దాటాక ఇంక వుండకూడదు. ప్రతి చిన్న విషయానికి కంపించిపోకూడదు.

* * *

90. పాఠం చెప్పిన తర్వాత అ పాఠం విద్యార్థులకు అర్థమయిందా లేదా అని తెలుసుకోవడానికి కొన్ని ప్రశ్నలు అడగమని విద్యార్థిని అడిగిన వాడు సరియైన గురువు. లేకపోతే బట్టీపట్టి చదివించే చదవుల వల్ల గుమాస్తాలు తయారవుతారు కాని, సృజనాత్మకమైన విద్యార్థులు తయారు కాలేరు.

* * *

91. ధనం ఒక్కటి లేకపోతేనే దరిద్రం కాదు. అనుభవించవలసినవి, తినగలిగినవి ముందువుండగా అనుభవించలేకపోవడము, మనసు ప్రశాంతత లేకపోవడం, నిద్ర సరిగ్గా పట్టకపోవడం కూడా దరిద్రమే.

* * *

92. ఒకమాట నోటివెంట వచ్చేస్తే ఇక ఎవరు ఆ మాటకు కట్టుబడి వుంటారో అటువంటి వాడిని పురుషోత్తముడని చెప్పుకుంటారు.

* * *

93. తమ పనులు పూర్తిచేసుకొని, తన మిత్రుడుకి అక్కర రాకుండా, వారి ముఖంకూడా చూడకుండా జీవితాన్ని గడుపుకుంటున్నటువంటి వాడియొక్క శరీరం పడిపోయిన తరువాత కుక్కలుకూడా వాడి శరీరాన్ని తినడానికి ఇష్టపడవు.

* * *

94. ధర్మబద్ధమైన అర్థము(ధనం), ధర్మబద్ధమైన కామము(కోరిక) మోక్షమునకు దారితీస్తాయి. ధర్మాన్ని వదిలేసి అర్థ కామాలను పట్టుకుంటే ప్రమాదం వస్తుంది కాని మోక్షం రాదు. అధర్మమైన అర్థము (ధనం) ఇంటికి వచ్చిన ఆ సమయానికి సంపాదించినవాడికి అపకారము జరగకపోవచ్చు కాని, అ పాపం వెంటాడుతూ వుంటుంది.

*　　*　　*

95. ఏ పుణ్యక్షేత్రానికి అయినా నేను వెడతాను అని చెప్పి వెళ్లక పోయిన ఫర్వాలేదు. కాని ఒక్క రామేశ్వరం వెడతాను అని చెప్పి వెళ్లకపోతే ఆ దోషం చాలా గట్టిగా మన ఖాతాలో వేస్తారు. అందుకని ఈశ్వరుడు నన్ను అనుగ్రహించి రామేశ్వరం తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను అని చెప్పాలి.

*　　*　　*

96. సంధ్యావందనం చేస్తూ, తను ఒకరికి ఉపకారం చేస్తాను అని చెప్పి, ఆ మాట తప్పినవాడు. తన బంధువులనందరినీ చంపి తాను తినేసి, తనని తాను చంపుకుని చచ్చిపోయినవాడితో సమానం.

*　　*　　*

97. బ్రహ్మ హత్య చేసినవాడికి, మద్యపానం చేసినవాడికి, దొంగతనం చేసినవాడికి, ఒక వత్రం చేస్తానని చేయనివాడికి ప్రాయశ్చితం వుండచ్చు కాని ఉపకారికి ప్రత్యుపకారం చేయనివాడికి ప్రాయశ్చితం వుండదు. అది మహాపాపం చేసినవాడితో సమానం.

*　　*　　*

98. అంకెల లెక్క : పదివేల కోట్లయితే ఒక ఆయుధం, లక్ష కోట్లయితే ఒక శంఖువు, వెయ్యి శంఖువులయితే ఒక అద్భుతం. పది అద్భుతములయితే ఒక మద్యం. పది మద్యమలయితే ఒక అంత్యం. ఇరవై అంత్యమలయితే ఒక సముద్రం. ముప్పై సముద్రాలయితే ఒక పదార్థం.

*　　*　　*

99. నిరాశావాదంతో వున్న అంగధుడు తన సైన్యానికి ప్రాయోపవేశం చేయమని(చనిపోదామని) సలహా ఇస్తే, ఆశావాదంతో వున్న హనుమంతుడుకి జాంబవంతుడు చెప్పగానే ఆ ఉత్సాహంతో సముద్రాలను మొత్తం చుట్టివస్తాను. అడ్డు వచ్చిన ఎవరినైనా తన శక్తితో క్రింద పడేస్తాను. ఆ రావణుడ్నినే చంపివస్తాను అన్న ఉత్సాహంతో సముద్రాన్ని దాటుతారు. అందుకే నిరాశావాదం కన్నా ఆశావాదంతో ఉన్నవారికి ఉత్సాహం, ధైర్యం ఎక్కువగా ఉంటాయి.

*　　*　　*

100. నిరాశావాదం బాగా పెరిగినప్పుడు ఎంతటివారికైనా అవతలివారిపై కోపం పెరుగుతుంది. ఆ కోపంతో భయంకరమైన ఆలోచనలు, వారినేదో చేయాలన్న తలంపులు వస్తాయి.

* * *

101. తెలిసికాని, తెలియకకాని సుందరకాండ విన్నవారికి శోకము, దుఃఖము నశించిపోతాయి. ఇంట్లో వున్న కష్టాలు తొలగిపోతాయి. బంధు సమాగమము జరుగుతుంది.

* * *

102. శివాలయంలో లింగాన్ని తిన్నగా దర్శనం చేయడాన్ని శివాగమం నిషేధించింది. అందుకని నందియొక్క వృషణాలు కుడిచేతితో ఒకసారి పట్టుకొని వదిలేసి, ఎడమచేతి యొక్క చూపుడువేలు, బొటనవేలు దాని కొమ్ముల మీద వేసి వాటి మధ్యనుండి 'హరహర మహదేవ శంభో శంకర' అంటూ ఆ శివలింగం వంక చూడాలి. అది కైలాసంలో శివదర్శనంతో సమానం. నందికి శివుడి మధ్యలోంచి నడువకూడదు

* * *

103. దక్షిణవైపున కూర్చోని నమస్కారం చెయ్యరు పెద్దలు. ఎందుకంటే దక్షిణానికి అధిపతి యముడు కనుక. సంసారబంధంలో వున్నవాడు శుభాన్ని కోరుకోవాలనే ఉద్దేశంతో దక్షిణదిక్కుకు నమస్కారం చేయకూడ దన్నారు పెద్దలు. దక్షిణదిక్కున ప్రవహించే గంగ కాశిలో ఉత్తరదిక్కుకు తిరుగుతుంది. అందుకే కాశి గంగకు అంత పవిత్రత వున్నది.

* * *

104. భగవంతుడిని పూర్తిగా మనం ధ్యానం చేయలేనప్పుడు ఆ ఫలితాన్ని పొందడానికి సులువైన మార్గాలుకూడా చూపారు. రామాయణమంతా వినలేకపోయినా, చదవలేకపోయినా సుందరకాండలోని సిద్ధిసర్గ వింటే చాలని, అలాగే నిత్య విష్ణు సహస్ర నామ పారాయణం చేసేవారు ఒకరోజు చేయడానికి వీలులేకపోతే రామ నామం జపిస్తేచాలు ఆ ఫలితం వస్తుందని చెప్పారు. అవకాశంలేనప్పుడు మాత్రమే చెయ్యడానికి, అవకాశం వుండికూడా చెయ్యకపోతే ఆ ఫలితం రాదు.

* * *

105. పంచామృతం అనగా ఆవునెయ్యి, ఆవుపాలు, ఆవు పెరుగు, పంచదార, తేనె. ప్యాకెట్ పాలను పంచామృతంలో వాడకూడదు.

* * *

106. చేసే పూజ కొద్దిసేపైనా భగవంతుడిమీద మనసు లగ్నం అయ్యేలా చూడాలి. అలా కాని పక్షంలో మీరు ఎంత సేపు పూజామందిరంలో గడిపినా ప్రయోజనం ఉండదు. అందుకని వారానికి ఒకసారి విశేషపూజ (కనీసం ఒక గంట) మిగతారోజులలో లఘుపూజ (తక్కువ సమయంలో చేసేది) అలా నెమ్మదిగా మనసును భగవంతుడిమీద లగ్నం అయ్యేలా అలవాటు చేసుకొని పూజచేస్తే ఎన్ని గంటలు పూజచేసినా ఇంకా చేయాలనే ఉత్సాహం వుంటుంది. ఉత్సాహం లేకుండా ఏదో తప్పదనుకొని చేసిన పూజ వృధాయే.

* * *

107. ధృతి, దృష్టి, మతి, దాస్యం, ఈ నాలుగింటిని ఎవరెవరు తమ పనిలో కలుపుకుంటున్నారో వారికి జీవితంలో ఓటమి అనేది లేదు. (ధృతి అంటే పట్టుదల, దృష్టి అంటే మంచి బుద్ధితో ఆలోచించే సమర్థత, మతి అంటే బుద్ధితో నిర్ణయించవలసినది. దాస్యం పనిమీద ధ్యాస).

* * *

108. .జీవితంలో ఏ వయసులో, ఏ సమయంలో, ఎప్పుడు ఏ ఆలోచన రావాలో. ఆ ఆలోచన రాకపోయినా, ఆ ఆలోచనతో నిర్ణయం చెయ్యకపోయినా తదనంతర జీవితమంతా ముళ్ళుపరిచిన శయ్యలాగా వుంటుంది. అందుకని ఒకస్థాయిలో నీయంతట నీవుగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలి. ఆ నిర్ణయం పట్టుదలతో కూడినదైయుండాలి.

* * *

109. తనకంటు ఒక ఆలోచన చెయ్యాలి. అది తనకై ఉపయోగించేలా వుండాలి. తన ఆలోచన సుఖాన్ని ఇస్తుంది. ఇతరుల మీద ఆలోచన వినాశనానికి దారితీస్తుంది. స్త్రీ మీద ఆలోచన ప్రళయానికి దారితీస్తుంది.

* * *

110. తన ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ఆహ్వానపత్రిక మీద ఇంటి పెద్దవాళ్ళ పేరుతోనే ముదించ్రాలి. అంటే తన కొడుకు పెళ్ళికి తన పేరుమీద కాకుండా తన తండ్రి జీవించి వుంటే తండ్రి పేరున లేదా తన అన్నగారు జీవించివుంటే అన్నగారు పేరున ముద్రించాలి.

* * *

111. పొంగిపోయిన పాలు గిన్నెనుదాటి ఎలా అగ్నికి ఆహుతి అవుతాయో, నీ పుణ్యఫలం అయిపోయిన తర్వాత నీ పాపంతో నీవుకూడా ఆహుతి అయిపోతావు.

* * *

112. తను చేయవలసిన పనికి కావలసిన శక్తిని అంచనా వేయకుండా గొప్పలు చెప్పరాదు.

113. జీవితంలో ఒకనాడు వున్న స్థితి వేరొకనాడు వుండదు. ఈనాడు ఆ పాపకార్యం వలన సుఖంగా వుండవచ్చుకాని ఈ జన్మలోనే ఆ పాపం యొక్క ఫలితాన్ని నీవు పొందుతావు.

* * *

114. ఎలుక కన్నా సంసారి ప్రపంచంలో లేదు. ఎలుకకు కూడా అన్నీ గృహస్థుని లక్షణాలే వుంటాయి. అవి మనలాగే ఇళ్లలోనే నివసిస్తాయి. అక్కరలేని ప్రతి వస్తువుని అది పట్టుకుంటుంది. మనం భూమికి కన్నం పెట్టి ఎలా ఇల్లు కడుతామో అది కన్నంపెట్టి అందులో నివసిస్తుంది. మనిషికి, ఎలుకకు బహుసంతానం. కొందరి మనుషులలాగే కొన్ని ఎలుకలకు ఒక లక్షణం వుంది. ఏ ఇంట్లో ఎలుక వుందో ఆ ఇంటి యాజమాని కాలు మాత్రమే కొరుకుతుంది. తిన్నింటి వాసాలు లెక్కబెట్టడంలాగా. అలాంటి ఎలుకను చప్పడు చెయ్యకుండా పిల్లి ఎలా తింటుందో. మనల్ని కూడా మృత్యువు అలాగే తీసుకువెళ్తుంది. పిల్లికి రాత్రి, పగలు తేడా వుండదు అది ఎప్పుడు నిద్రపోతుందో ఎవరికి తెలియదు, మృత్యువు కూడా అంతే.

## మాట్లాడే విధానం

♦ ఎవరి నాలుక చివర మంచిమాటలు వుంటాయో అటువంటి వారికి లక్ష్మీకటాక్షం వుంటుంది.

♦ పదిమంది అతనికి మిత్రులుగా వుంటారు. మంచిగా మాట్లాడేవారికి అనేక మంది బంధువులు, స్నేహితులు వుంటారు.

♦ మాట్లాడకూడని మాటలు అలవాటు చేసుకున్నవాడు కారాగారంలో పడి పోయినా, చంపబడినా ఆశ్చర్యం లేదు.

♦ మాట ఒక్కటి మనిషిని ఎంత ఎత్తుకైనా తీసుకెళుతుంది.

♦మాట ఒక్కటి మనిషిని ఎంత క్రిందకైనా తీసుకెళుతుంది.

♦ ఒక వ్యక్తిని పడుకోబెట్టి రంపంతో కోసేసిన అతనికి బాధ కలుగు తుందో లేదో కాని అనరాని మాట ఒకటి అంటే అవతలి వ్యక్తికి అంత బాధ కలుగుతుంది.

♦ ఎంత కష్టంలో వున్నవాడినైనా ఒక మంచిమాట మాట్లాడితే అంత ఊరట పొందుతాడు.

♦ ఒక్కమాట జీవితాల్ని మార్చేసి కొత్త దిశవైపుకు ప్రయాణింపజేస్తుంది.

♦ ఒక్కమాట ఎంత గౌరవంగా బ్రతుకుతున్నవాడిని కూడా అతని దిక్కు మార్చి అసహ్యకరమైనటువంటి విధానంలోకి తీసుకెళుతుంది.

♦ మాట్లాడే హక్కు 84 లక్షల జీవరాశులలో మనిషికి మాత్రమే వుంది.

115. మనిషి జీవితం మొదలయ్యాక శరీరానికి ఉండే సుఖ దుఃఖాలు ఎంతవారైనా అనుభవించవల్సిందే. జ్ఞాని కూడా ఇవి అనుభవిస్తాడు. ఎలా అనుభవిస్తాడంటే సాక్షిగా, అంటే చూసీ, చూడనట్టుగా అనుభవిస్తాడు. ఎంత భగవంతుడి సేవకులైనా రామకృష్ణ పరమహంసకూ గొంతులో రాచపుండు పుట్టింది. రమణ మహర్షికి సర్కోమా వ్యాధి వచ్చింది. వివేకానంద అంతటి వారికి అనారోగ్యం వచ్చింది. అంతటి జ్ఞానులుకూడా ప్రారబ్దాన్ని అనుభవించక తప్పలేదు.

* * *

116. మనకు దేహాభిమానం ఎలావుంటుందో దానికోదాహరణ : ఒక దేవాలయంలో ఒక కళ్యాణం చేస్తున్నారు వెళదామా అంటే దానికి డబ్బులు వసూలు చేస్తారేమో నాదగ్గర డబ్బులు లేవు అంటాడు. కాదు ఉచితమే అంటే ఎన్ని గంటలు పడుతుందో ఎండలో అంత సేపు పూజలో కూర్చోడం నావల్ల కాదు అంటాడు. కాదండీ; నీడలోనే గుడి అవరణలోనే అంటే అన్ని గంటలు కూర్చోవాలికదాండి టీ, టిఫినులు పెడతారా అని ఇలా సందేహాలు వస్తూనే వుంటాయి. ఇదంతా దేహాభిమానమే.

* * *

117. అత్తవారింటిలో కాని, బంధువుల ఇంట్లోకాని, గుళ్ళోకాని కుడికాలు ముందర పెట్టి నడవాలి. అలా నడిస్తే ఆ ఇల్లుతో మిత్రభేధం. లేక ఎడమకాలు ముందు పెట్టి నడిస్తే శత్రువు ఇంట్లో కాలుపెట్టినట్టే. అ ఇంటి వారితో మనకు శత్రుత్వం ఏర్పడుతుంది. కొత్త కోడలు అత్తవారింట్లో గృహప్రవేశం సమయంలో కుడి కాలు పెట్టకుండా ఎడమకాలు పెడితే మామగారి తలమీద కాలు పెట్టినట్లు లెక్క.

* * *

118. ఏకాగ్రత లేకుండా శబ్దం చేస్తూ ధ్వనిని చేస్తూ, చూపు ఒకవైపు వేరే వారితో మాట్లాడుతూ పూజ చెయ్యడం రాక్షసులు చేసే పూజలాంటిది.

* * *

119. హనుమంతుడు తొలిసారిగా లంకలో రావణున్ని సూటిగా చూడలేక పోయాడు. రావణుని తపోశక్తి అడ్డుతగిలింది. చెట్లు కొమ్మల అడ్డుపెట్టుకుని చూస్తాడు. పాపాత్ములైన వారికి పూర్వఫలం లేక వంశఫలం చేత, పుణ్యఫలం చేత ఐశ్వర్యం, సుఖాలు వున్నట్టు కనిపించవచ్చు. ఆయన ఆచరించిన మార్గమే సరియైనది అనుకుంటే ఆయనలాగా వంశంలో ఎవరూ మిగలకుండా నాశనం అయిపోతారు.

* * *

120. తన భార్య తప్ప మరొక స్త్రీ నిదురపోతున్నప్పడు పురుషుడు అటువైపు వెళ్లకూడదు.

121. ఎవడు శోకమునకు లొంగిపోడో, ఎవడు నిర్వేదమునకు లొంగిపోడో, ఎవడు నిరంతరం ఉత్సాహంతో వుంటాడో వాడు మాత్రమే కార్యాన్ని సాధించగలడు.

*    *    *

122. నిద్రలేవగానే మంచం నుంచి కిందకు దిగగానే తనకు జ్ఞానమిచ్చిన గురువుల పాదాలను తల్చుకొని, భూదేవి మీద సాష్టాంగం చేస్తూ **"సముద్ర వసనే దేవి, పర్వత స్థనమండలే, విష్ణుపత్నీం నమస్తుభ్యం, పాదహాతిం క్షమస్వమే"** 'అమ్మా! నాకు దిక్కులేక నిన్ను కాళ్ళతో తన్నానమ్మా! నా అజ్ఞానాన్ని మన్నించమ్మా! తెలియక చంటితనంలో పాలుత్రాగి అమ్మ గుండెలమీద తన్నిన పిల్లవాణ్ణి అమ్మ క్షమించినట్లు, ఇవాళ జ్ఞానమున్నా వేరొక మార్గంలేక నీమీద కాలుమోపి లేస్తున్నానమ్మా, అమ్మా నన్ను మన్నించమ్మా' అని నమస్కరించి లేచి నడవమని శాస్త్రము చెప్పింది.

*    *    *

123. నీకు ఓపికవుండి సంపాదించిన రోజుల్లో అనేకరకాల బంధుత్వాలు పెట్టుకొని ఇంటికి వస్తారు. ఓపిక అయిపోయి మంచాన పడ్డరోజు నువ్వేలా వున్నావోకూడా అడగరు. కడుపున పుట్టినవారు కూడా సేవ చెయ్యరు. పనిమనిషిని పెట్టి చేయిస్తారు. మంచినీళ్ళ కోసం పదిసార్లు పిలిస్తే గొణుక్కుంటూ కోపంగా ఇస్తుంది పనిమనిషి. అది చూసి పిల్లలు విసుక్కొంటారు. అప్పడు నీకు ఈశ్వరుడు గుర్తుకువస్తాడు. అందుకని ఓపికున్న రోజుల్లో ఈశ్వరుని వేడుకొని ఇలాంటి దుస్థితి నాకు రాకూడదని ప్రార్థించాలన్నారు శంకరాచార్యులు.

*    *    *

124. స్త్రీకి ఎడమ కన్ను, ఎడమ భుజం, ఎడమ కాలు అదిరితే త్వరలో శుభం జరుగుతుందని సూచకం. అదే మగవాడికి జరిగితే అశుభాన్ని సూచిస్తుంది.

*    *    *

125. స్త్రీ ఎప్పడూ తన పేరు కన్నా ముందు తన భర్త పేరునే పూజ చేయించాలి. అలాగే తన అత్తింటి క్షేమముకోరిన తర్వాత తన తల్లిదండ్రుల క్షేమాన్ని కాంక్షించాలి.

*    *    *

126. భక్తులనుగాని, మహాత్ములును గాని, పెద్దలనుగాని కష్టపెడితే, వారి మనసు బాధపడితే వారికి భగవదనుగ్రహం కలుగదు. బాధపడిన వారు మనల్ని క్షమిస్తే మళ్ళీ మనకు భగవదనుగ్రహం కలుగుతుంది.

*    *    *

127. చిన్నవారు పెద్దవారితో ఎప్పుడూ దెబ్బలాడకూడదు. ఒకవేళ పెద్దవారు నీయందు దోషం లేకున్నా, నిన్ను ఏమన్నా, వారితో వాదించకూడదు. అలా చేస్తే పాపం. నీ తప్పు లేకున్నా, వారు నిన్ను దూషిస్తే అది తర్వాత నీకు ఆశీర్వచనమవుతుంది. అప్పుడు పెద్దవారు శాంతించాక నేను ఈ తప్పు చేయలేదు అని జరిగిన విషయాన్ని వారికి వివరించాలి. అలాగే పెద్దవారు చిన్నవారికి ఎప్పుడూ క్షమాపణ చెప్పకూడదు. ఒకవేళ చిన్నవారి తప్పులేకున్నా వారిని దూషిస్తే చిన్నవారికి క్షమాపణ చెప్పకుండా ఈశ్వరుడి దగ్గరికి వెళ్ళి వాడి తప్పులేకున్నా వాడిని నిందించానని చెప్పి నన్ను మన్నించమని ప్రార్థించాలి. పెద్దవారు ఒక భార్యకు తప్ప ఎవ్వరికీ క్షమాపణ చెప్పకూడదు. తల్లిదండ్రులు పిల్లల దగ్గర, అన్నలు తమ్ముళ్ళ దగ్గర ఎప్పుడూ క్షమాపణ చెప్పకూడదని ధర్మశాస్త్రం చెబుతుంది.

* * *

128.నేను చేస్తున్నాను నేను చేస్తున్నాను అనుకోకు ఈశ్వరుడు నా చేత చేయిస్తున్నాడని నువ్వు అనుకున్నప్పుడు అదే భక్తి జ్ఞానం వైపు వెళుతుంది

* * *

129. భుజంమీద ఉత్తరీయం వేసుకోకుండా ఎవరికైనా బట్టలు పెడితే ఆరు నెలల తరువాత పుచ్చుకున్నవారో, బట్టలు పెట్టిన వారో ఎవరో ఒకరు ఇక వుండరని శాస్త్రం చెబుతుంది. అలాగే ఇంటికి పెద్దవారు, మహాత్ములు వచ్చినప్పుడు భుజం మీద ఉత్తరీయం లేకుండా పలకరించకూడదు.

* * *

130. మనసు మూడో కన్నులాంటిది. ఎందుకంటే మనం కళ్ళుమూసుకొని ధ్యానం చేస్తుంటే మనసు వెళ్ళి ఎక్కడో ఒక ప్రదేశాన్ని గాని, ఒక ఆహార పదార్థాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని చూపిస్తుంది. దాన్ని నియంత్రించినప్పుడు నువ్వు దైవంతో మమేకమై నీయొక్క పుణ్యరాశిని పెంచుకోవచ్చు.

* * *

131. సముద్రం అంటే సంసారం. ఒక సంసారమనే సముద్రమునందు మగ్నుడైన వాడు యోగి ఎందుకవుతాడు? ఎలా అవుతాడు?

* * *

132. సంకల్పమన్నది సాధనకు మొదటి మెట్టు. పనిని ప్రారంభం చెయ్యడం ఒక ఎత్తు. దాని సాధనకు నిలబడడం ఒక ఎత్తు.

ఆంజనేయుడి చుట్టు ప్రదక్షిణాలు చేసేటప్పుడు ఈ శ్లోకం చెబుతూ తిరగాలి అని శాస్త్రం చెబుతుంది.

**ఆంజనేయం మహావీరం బ్రహ్మావిష్ణు శివాత్మకం**

**తరుణార్క ప్రభం శాంతం రామదూతం నమామ్యహం**

133 సంసార బంధంలో ఎక్కువగా ఉన్నవాడు ఆధ్యాత్మిక మార్గంలో ఎక్కువ దూరం వెళ్లలేడు. సంసారబంధంలో తక్కువగా వున్నవాడు ఆధ్యాత్మిక మార్గంలో ఎక్కువ దూరం వెళ్లగలడు.

*  *  *

134. చెయ్యవలసిన పని చెయ్యవలసిన సమయంలో చెయ్యకపోతే మహాత్ములకు కూడా కోపం వస్తుంది.

*  *  *

135. సాధనలో ఉన్నప్పుడు అహం మొదలయితే నేను, నాది, నావాళ్ళు, నా ప్రదేశం అనే మీమాంసతో నీ కార్యదీక్ష పక్కదారి పడుతుంది. అది వినాశనానికి దారితీస్తుంది. నీవు చేసినపని ఎవరైనా పొగిడినప్పుడు నీ మనసులో అంతా ఈశ్వర కృప అనుకో. అది నీ అహాన్ని తగ్గిస్తుంది. నేనే చేయగలపని అని నువ్వు అనుకుంటే అప్పుడే నీలో అహం మొదలవుతుంది.

*  *  *

136. అగ్ని చేత అన్నం ఉడికినట్టు, ఈ భక్తి, ఈ కర్మ జ్ఞానం వైపు వెళ్ళాలి. అ జ్ఞానం వైపు వెళ్ళితే బ్రహ్మం ఇక్కడే వుందని తెలుసుకున్నవాడు బ్రహ్మం అవుతున్నాడు. జ్ఞానం వైపు వెళ్ళకుండా కేవలం భక్తితోవున్నా మళ్ళీ జ్ఞానం కోసం మరల మరల జన్మించాల్సిందే.

*  *  *

137. ఒక వస్తువుని గాని, ఒక దృశ్యంగాని నీవు చూస్తున్నప్పుడు నీ మనసుతో జడ్జిమెంట్ చేసుకో నేను చూస్తున్నది పాపాన్ని ఇస్తుందా, పుణ్యాన్ని ఇస్తుందా అని. అనుకోకుండా నీవు చూస్తే దాని వలన నీ మనసు ఎలాంటి ఉద్రేకం పడకుండా జాగ్రత్తపడాలి.

*  *  *

138. పుట్టిన ప్రతివారు కొడుకులు కాలేరు అని అంది శాస్త్రం. ఆ కొడుకులలో రకాలు ఇవి :

౧. శత్రుపుత్రుడు : వీడు ఎప్పుడు తల్లిదండ్రులను వేధించుకుతింటాడు. పుట్టి నప్పటినుంచి తండ్రి ఏది చెబితే దానికి వ్యతిరేకంగా వీడు మాట్లాడతాడు. వీడి బాధ తట్టుకోలేక తండ్రి ఏడ్చి ఏడ్చి మరణిస్తాడు.

౨. మిత్రపుత్రుడు : వాడు గతజన్మలో విశేషమైన స్నేహంచేసి మిత్రుడిని వదలివెళ్లిపోతాడు. ఆ మిత్రుడికి కొడుకుగా వస్తాడు. వాడు ఎప్పుడూ తండ్రికి మిత్రుడులాగా మాట్లాడతాడు, అలా మాటల సహాయం చేస్తాడు. ఒక తండ్రికి కొడుకులా అల్లుకుపోలేడు.

౩. సేవకపుత్రుడు : వీడు ఏమి చేస్తాడంటే తండ్రి వీధిలోంచి ఇంట్లోకి రాగానే కూర్చోమని కుర్చీవేస్తాడు. తండ్రి పడుకుంటే కాళ్లు పడుతాడు. తండ్రి ఏమి చెప్పినా చేస్తాడు. కాని వాడికి అక్షరంముక్క రాదు. వాణ్ని ఎందులో పెడితే

ప్రయోజకుడు అవుతాడో తండ్రికి అర్థంకాదు. ఏ రంగంలో వుంచినా ఎందులోనూ రాణించడు. అలా రాణించకుండా వుండి పోయిన కొడుకు గత జన్మలో నువ్వు ఎవరి దగ్గరో చాలాకాలం సేవకుడిగా వున్నవాడికి చాలా ఎక్కువ మాన్యాలు. బహుమతులిస్తే వాడు నీ మీద ప్రేమ పెంచుకుంటే వాడు ఈ జన్మలో సేవకపుత్రుడిగా వస్తాడు. వాడు నిరంతరం తండ్రికి సేవ చేస్తాడు.

౪. కర్మపుత్రుడు : వీడు పుట్టగానే తండ్రికి ఒకచోటనే చేసే ఉద్యోగం లేక పోవడం వలన అత్తగారింట్లోనో, తన అమ్మగారింట్లో పెంచుతాడు. వాడు పెరగగానే ఉద్యోగరీత్యా వేరే వూరికి వెళతాడు. వీడు పుట్టినప్పటినుంచి తల్లిదండ్రుల దగ్గర పెరగక, వారితో ఎక్కువ సంబంధం వీడికి వుండదు. ఎప్పుడూ చుట్టపు చూపుగా వస్తాడు వెళతాడు. ఇటువంటి వాడు కేవలం అంత్యక్రియలకు మాత్రమే పనిచేస్తాడు.

౫. నిజపుత్రుడు : వాడుపుట్టినప్పటినుంచి తండ్రి దగ్గర పెరుగుతాడు. తండ్రి దగ్గరే జ్ఞానాన్ని నేర్చుకుంటాడు. తండ్రి దగ్గర ఎలాంటి అరమరికలు లేకుండా కలిసిపోతాడు. వీరు నిరంతరం కలిసేవుంటారు. ఒక తండ్రి కొడుకుల్లా కలిసి మెలిసి వుంటారు. తండ్రిగారి కీర్తిని నిలబెడతాడు. ప్రతి విషయంలో తండ్రి సలహాను తీసుకుంటాడు.

* * *

139. సేవకులు మూడు రకాలు :

౧. ప్రభువు చెప్పిన పనికన్నా తనలో వున్న సమర్థత చేత మరింత ఎక్కువ పనిని చేసి ప్రభువుయొక్క మనసు గెలుచుకునే సామర్థ్యం ఉన్నవాడు ఉత్తమమైన సేవకుడు.

౨. ప్రభువు ఏ పని చెప్పారో ఆ పని చేయడానికి కావలసిన సామర్థ్యం ఉన్నవారు కాబట్టి ఆ పనిమాత్రంచేసి, అంతకన్నా ఎక్కువ చేయగలిగిన సామర్థ్యమున్నా, ప్రభువు చెప్పలేదు కాబట్టి, మనకెందుకని చెయ్యకుండా ఎంత చెప్పారో అంత మాత్రమే చేసినవారు మధ్యముడైన సేవకుడు.

౩. తనకి సమర్థత వున్నా నేనెందుకు చెయ్యాలి అని ప్రభువుయొక్క కార్యక్రమం చెయ్యనివాడెవడు ఉంటాడో వాడు అథముడైన సేవకుడు.

* * *

140. తన పిల్లల ముందు తన సోదరులనుకాని, బంధువులను కాని తూలనాడితే వారు మన యింటికి వచ్చినప్పుడు మన పిల్లలు వారిపట్ల అమర్యాదగానే ప్రవర్తిస్తారు.

* * *

141. ఎన్ని విద్యలున్నా, ఎంత శక్తివున్నా అవసరానికి చేసే కార్యం మంచిది కానప్పుడు అవి గుర్తుకురావు. అదే మీరు చేసే కార్యం మంచిదై నీవు ఏమీ తెలియని వాడివైనా నీ మనసు ఉత్తేజం పొంది, నీ బుద్ధి నీకు మార్గాన్ని చూపించి, కార్యసాధకుణ్ణి చేస్తుంది.

*   *   *

142. కుక్కను పెంచుకునేవాళ్ళు ఇంట్లో దేవాతర్చన జరిగే ప్రదేశం దగ్గర, పూజగదిలోకి కుక్కను వెళ్ళనిస్తే ఆ యింటి దేవతలు అ యింట్లో నైవైద్యం స్వీకరించరు. ఆ దేవతలు ఉపవాసముంటే అ యింటి యజమానికి నాశనం.

*   *   *

143 ఒకరు నిద్రపోతున్నప్పుడు కారణం లేకుండా లేపకూడదు. బలమైన కారణం లేకుండా లేపితే పాపం. అలాగే సాయం సంధ్యవేళలో నిద్రపోకూడదు. అటువంటివారిని నిద్రలేపవచ్చు.

*   *   *

144. సాయం సంధ్యవేళలో నిద్రపోకూడదు. ఆ సమయంలో శివుడు వృషభ వాహనుడై బయటకు వస్తాడు. ఆ సమయంలో ఈశ్వరపూజ చేయాలి. ఆ సమయంలో తినడంగాని, నిదురపోవడంగాని చేస్తే ఆ శివగణాలు చూసి శపిస్తాయి. ఆ శాపాలు మన సంతాన రూపంలోనే వచ్చి మనకు మనసు ప్రశాంతత లేకుండా నిరంతర బాధకు గురిచేస్తాయి.

*   *   *

145. మరణించునటువంటి వ్యక్తిగురించి వైరంతో(శతృత్వంతో) సంబంధించిన మాట మనిషిగా పుట్టినవాడి నోటివెంట రాకూడదు.

*   *   *

146. ఎవరైతే సీతమ్మ అగ్ని ప్రవేశ ఘట్టం విన్నారో వారికి జీవితంలో అవమానం అనేది జరగదు.

*   *   *

147. ఎవరైనా ఈ శరీరంతో వున్నప్పుడు పుణ్యకార్యాలు చేయక, భక్తివైపు మొగ్గు చూపక చనిపోతారో వారి తర్వాతి మూడు తరాలలో ఎవరైనా మహాత్ముడు జన్మిస్తే వారు చేసే పుణ్యకార్యాల వలన తన పాపం తొలగిపోయి ఆ జీవికి మోక్షం ఇస్తారు. అందుకే చనిపోయిన తరువాత ఆ జీవిని మూడు తరాల వరకు పితృలోకంలో వుంచుతారు. ఆ తర్వాత వేరే శరీరంలోకి పంపిస్తారు. అలా అలా తిరిగి కొన్ని కోట్ల జన్మల తర్వాత మనుష్య జన్మ వస్తుంది.

*   *   *

148. ఎవరైనా ధర్మమార్గంలో సంపాందించాలి. ఏమీ సంపాదించకపోతే తండ్రి సంతోషించడు, తల్లి ఆనందంగా చూడదు, అన్నదమ్ములు పలకరించరు. సేవకుడు నమస్కారం చెయ్యడు, కొడుకు గౌరవించడు, భార్య ప్రియమార కౌగిలించదు, అందుకే నీతి మార్గంలో సంపాందించాలి. అటువంటి సంపాదన నీకు శ్రీరామరక్ష అవుతుంది.

## (భాగవతం ప్రవచనాల నుండి)

01. మనకి 18 పురాణాలు వున్నాయి వీటన్నిటినీ వ్యాసమహర్షి రచించారు అవి. ౧. మార్కండేయ పురాణం ౨. మత్స్యపురాణం ౩. భాగవతం ౪. భవిష్య పురాణం ౫. బ్రహ్మపురాణం ౬. బ్రహ్మాండ పురాణం ౭. బ్రహ్మవైవస్వత పురాణం ౮. వరాహ పురాణం ౯. విష్ణు పురాణం ౧౦. వామన పురాణం ౧౧.వాయుపురాణం ౧౨. నారద పురాణం ౧౩. పద్మపురాణం ౧౪. లింగ పురాణం ౧౫. గరుడ పురాణం ౧౬. కూర్మ పురాణం ౧౭. స్కంధపురాణం ౧౮. అగ్నిపురాణం

* * *

02. **అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల బె**
**ద్దమ్మ సురారులమ్మ కడు పాఱటి పుచ్చినయమ్మ దన్నులో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా**
**యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్**

ఎప్పుడు పడితే శుద్ధి, శుచి లేకుండా 'ఓం హ్రైం హ్రీం క్లీం శ్రీమాత్రయే నమ!' ఈ బీజక్షరాలు పలకలేము. పలకకూడదు. కాని ఈ పద్యం ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడైనా చదువుకొనవచ్చు. అలా చదివితే ఆ బీజాక్షర మంత్రం యొక్క ఫలం మనకు కలుగుతుంది. అమ్మవారి దయ ప్రసరిస్తుంది.

* * *

03. **శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా**
**హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుందమం**
**దార సుధా పయోధి సితతామర సామర వాహినీ శుభా**
**కారతనొప్పు నిన్ను మదిగానగ నెన్నడు గల్గు భారతీ !**

ఈ పద్యం చదివితే సరస్వతి దేవి యొక్క 11 మంత్రములు జ్ఞానశోక్లాలు చదివినట్లే. చిన్నపిల్లలకు అక్షరభ్యాసం చేసినప్పటినుండి ప్రతిరోజు సరస్వతి దేవి ముందు ఈ పద్యం చదివితే సరస్వతి దేవి కటక్షం కలుగుతుంది.

* * *

04. వృద్ధాప్యంలో అంత్యమునందు కామముతో మాట్లాడేవాడు. తదుపరి జన్మలో వేశ్య స్త్రీగా పుట్టిస్తారు. అలా పుట్టిన తరువాత కొన్ని సంవత్సరాలకు శరీరంలో చీముకారే పుండ్లుపుట్టి, అందులోంచి కారే చీము వలన కొంత దూరమునుంచి పోయే వారికి ఆ వాసన వచ్చి చీదరించుకుంటూ వెళ్తారు. అ బాధలో మళ్ళీ ఈశ్వరుని వేడుకుంటే ఆ బాధను నివారించి జన్మను సమాప్తం చేస్తాడు.

05. కలియుగంలో ఆర్తితో పుణ్యక్షేత్రాల దర్శనాన్ని మనసులో కోరుకుంటే ఆ క్షేత్రాన్ని దర్శించిన ఫలితాన్ని మన ఖాతాలో వేస్తారు. ఇది రామేశ్వరం క్షేత్రానికి వర్తించదు. రామేశ్వరానికి వెళ్ళాలి అనుకుంటే వెళ్ళాలి లేకపోతే పాపఫలితాన్ని ఖాతాలో వేస్తారు. పాప కార్యం మనసులో తలచుకుంటే ఫలితం మన ఖాతాలో వెయ్యరు. ఆ పాపకార్యం పూర్తయితే ఆ ఫలితం వస్తుంది.

* * *

06. కోటిమంది వైద్యులు కూడివచ్చిన కాని మరణమయ్యేడి వ్యాధిని మాన్పలేరు.

* * *

07. గురుగీతలో పరమశివుడు పార్వతీదేవితో చెపుతాడు. 'గురువు అంటే ఎవరో తెలుసా! సతతము ఎవరి వాక్కు అజ్ఞానమును దహించివేస్తుందో, ఎవరు సమస్తపురాణసారములను వడబోసి అలవోకగా అర్థమయేటట్టు చెప్పగలిగిన వాక్కు నైపుణ్యమును పొందివున్నారో, ఎవరు తన నిత్యజీవితములో అనుష్టాన పర్యంతము వరకు భగవద్భక్తిని సాధించుకుని ఉంచుకున్నాడో వారు గురువు. కొన్నికోట్ల జన్మల నుండి మన వెంటతరుముకుని వస్తున్న కర్మపాశములను, మనం సంపాదించుకున్న పాపరాశి ధ్వంసం అయిపోవడానికి కావలిసిన మార్గమును ఎవరు ఉపదేశం చేస్తారో వారు మాత్రమే గురువు'.

* * *

08. ప్రపంచంలో చావుకి భయపడడం అంత వెర్రితనం ఇంకొకటి లేదు. చావుకి భయపడి మనం పారిపోలేము. అది ఎప్పుడు వస్తుందో తెలియదు.

* * *

09. "పిల్లలు వారివారి జీవితములో స్థిరపడిపోయారు. ఇంక నన్ను ఉద్ధరించేవారెవరు? నా పని నేను చూసుకోవాలి. నన్ను నేను ఉద్ధరించుకోవాలి. అందుకని నేను ఈశ్వరాభిముఖుడనై ఇప్పటినుంచి ఒక ప్రయత్నం ప్రారంభం చేస్తాను' అనుకొని భూశయనం చేసి, తలగడ బదులుగ చేతిని పెట్టుకొని పడుకోవడానికి ప్రయత్నం చేయాలి. వెళ్ళిపోయే శరీరం వెళ్ళిపోతుంది. ఈశ్వర నిర్మితమయిన ప్రకృతి ఉంది. ఈశ్వరుడు ఇచ్చినదానితో సంతృప్తిపడి ఈశ్వరుని ధ్యానిస్తూ ప్రశాంతముగా ఆధ్యాత్మిక జీవితమును గడపడానికి ప్రయత్నించాలి. సంసారలంపటమును, ఇంద్రియలౌల్యమును, లేనిపోని అహంకారమును తగ్గించుకుని, నీ గతం గురించి మాట్లాడడం తగ్గించివేసి ప్రయత్నపూర్వకంగా ఈశ్వరుడి గురించి మాట్లాడడం ప్రారంభించాలి.

50వ ఏడు వచ్చినప్పటినుండి వచ్చే గొప్ప అవలక్షణము వాచాలత్వము. తనంతవాడిని తాను అనే అహంకారమును పెంచి పోషించుకుంటాడు. తాను ఉద్యోగంలో ఉన్నప్పడు చేసిన కొన్ని తప్పు పనులను తన సాధితములుగ(సాధించినవి) చెప్పకుంటాడు. తాను వయస్సులో ఉండగా అలా ప్రవర్తించానని క్షమాపణ చెప్పడు. తాను చేసిన ఆ పనులను తన కొడుకులకి, మనుమలకి చెప్పకుంటాడు. ఇంకా లేనిపోని ఆభిజాత్యాలన్నిటిని ఒంటికిపెట్టి సుఖంగా ఇంకా సుఖంగా జీవించుదామని అనుకుంటాడు. ఎంత సుఖంగా దీనిని ఉంచుదామని నీవు అనుకుంటున్నావో వెళ్లిపోయే సమయం ఆసన్నమయినప్పడు ఎన్ని సుఖములు తీసుకువచ్చి అక్కడ పెట్టినా, నీవు సంసారమునందు సాధించిన ఏ ఉపకరణముచేత మరణమును తప్పించుకొనజాలవు. నీ భార్యకాని, నీ బిడ్డలు కాని, నీ విద్యార్హతలు కాని, నీ వాహనములుకాని, నీ ఉద్యోగం కాని, నీవు సంపాదించిన డబ్బుకాని ఇవేమీ అక్కరకు రావు. అని శుకుడు తీర్పు చెప్పాడు.

*   *   *

10. నీ అంతగా నీవుగా 'నేను భక్తిగా వుంటాను నేను భక్తిగా వుంటాను' అంటే కుదరదు. నీకు ఈశ్వరుని యందు పూనిక కలగాలి. ఇంట్లో కూర్చుని భగవంతుని మీద భక్తి రావాలని అనుకుంటే రాదు. ఈశ్వరునికి ముందు నీవు నమస్కారం చేయడం మొదలు పెడితే ఆయన నీకొక దారి చూపిస్తాడు. భగవంతుని కథలు వినడమనే స్థితికి నిన్ను తీసుకువెడతాడు. కాని మనిషి కొన్ని కోట్ల కోట్ల జన్మలవరకు అసలు భాగవత కథవైపు వెళ్లడు. కాని వెళ్లాడు అంటే అతని జీవితంలో గొప్ప మార్పు ప్రారంభమయినదన్నమాట. ఆసాంతము రక్షణము ఈయగలిగినది. భగవంతుని కథలు వినడం నీవు ప్రారంభిస్తే భక్తి కలుగుతుంది. ఆ భక్తితో అంతటా నిండియుండి చూస్తున్నవాడు, చేయిస్తున్నవాడు సర్వేశ్వరుడనే భావన నీకు కలిగిననాడు. నీకు తెలియకుండా భక్తిలో ఒక విచిత్రం ఏర్పడుతుంది. (అది ఏదో పూజగదిలోకి వెళ్లి ఒక పావుగంటో అరగంటో పూజచేయడం కాదు.) భక్తి అలవాటయితే స్వప్నమునందు కూడా భగవంతుని గురించే ఆలోచిస్తాడు. ఏ పనిలో వున్నా మనస్సు ఎప్పడూ ఈశ్వరపాదముల దగ్గర ఉంటుంది. ప్రతి వస్తువులో, ప్రతి మనిషిలో ఈశ్వరుణ్ణి చూస్తాడు.

*   *   *

11. బ్రహ్మగారు మైథునసృష్టి జరపడానికి మొట్టమొదట సృష్టించినవాళ్లలో మొట్టమొదట పుట్టినవారు స్వాయంభువ మనువు. ఆయన భార్య పేరు శతరూప. వాళ్ళు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులను, అకూతి, ప్రసూతి, దేవహూతి అనే ముగ్గురు కుమార్తెలను కన్నారు.

* * *

12. ఉత్తరసంధ్యాసమయం (సూర్యాస్తమయం) పూర్వసంధ్యకన్న పవిత్రము. ఈ సమయంలో మూడుపనులు ఎట్టిపరిస్థితులలో పొరపాటునకూడా చేయరాదు. శాస్త్రంలో నిషిద్ధం. అవి 1) తినడం 2)నిద్రించటం 3) మైథునము (స్త్రీ పురుష సంగమము). ఈ మూడు పనులు చేస్తే తీవ్రమైన ఫలితాలు వస్తాయి..

* * *

13. తనకి బాగా దగ్గరగా ఉండేవాడు(ఉదా: సెక్రటరీ, అసిస్టెంట్, కాపలదారులు) తప్పుడు పనిచేస్తే ప్రభువుల పేరు పోతుంది. కీర్తి పోతుంది. ఇది చూసి కూడా తప్పను సవరించకపోతే అది తన శరీరంలో కుష్ఠు పుట్టిన దానిని పట్టించుకోవడం లాంటిది. అ వ్యాధి మెల్లమెల్లగా శరీరంలోని అన్ని అవయవాలను తినేస్తుంది.

* * *

14. సృష్టి పలు విధాలుగా వుంటాయి. అందులో అండ సృష్టి, ఈశ్వర సంకల్ప సృష్టి, మైథున సృష్టి (స్త్రీ పురుష సంగమం వలన కలిగే సంతానం), జంతు సృష్టి

* * *

15. పితృపంచకం అనగా ఈ ఐదుగురు తండ్రితో సమానం. వారు ౧)జన్మనిచ్చిన తండ్రి, ౨) గాయత్రీ మంత్రమును ఉపదేశించిన తండ్రి, ౩) పరిపాలించే రాజు ౪) పిల్లని ఇచ్చిన మామగారు ౫) పెద్దన్నగారు లేదా గురువు.

* * *

16. నదీ స్నానం చేసేటప్పుడు ఒక మంత్రం చెపుతూ గట్టునవున్న ఇసుక తీసి నదిలోకి విసిరి స్నానం చెయ్యాలి. అ మంత్రం తెలియకపోతే 'కపర్దీ' (శివుని జటాజుటం) అని మననం చేసుకోవాలి. అలా చెయ్యకపోతే ఆ స్నానం యొక్క పుణ్యాన్ని బ్రహ్మ చేత సృష్టించిబడిన కృచ్ఛ దానిని తినేస్తుంది. అ పుణ్యం మనకు దక్కదు.

* * *

17. ఈ సృష్టిలో పద్నాలుగు లోకాలు ఉన్నాయి అవి.
౧. సత్యలోకము ౨. తప లోకము ౩. జనలోకము ౪. మహర్లోకము ౫. సువర్లోకము ౬. భువర్లోకము ౭. భూలోకము ౮. అతల లోకము ౯. వితలలోకము ౧౦. సుతలలోకము ౧౧.తలాతల లోకము ౧౨. మహాతల లోకము ౧౩. రసాతల లోకము ౧౪. పాతాళ లోకము

* * *

18. పురుషుడి ఎడమ తొడ మీద భార్య మాత్రమే కూర్చోవాలి. కుడి తొడ మీద కూతురు లేదా కోడలు మాత్రమే కూర్చోవాలి. కూతురు లేదా కోడలు కాని ఎడమ తొడ మీద ఎప్పుడూ కూర్చోకూడదు.

* * *

19. ప్రపంచంలో ఎవరయినా దేనినయినా అతిక్రమించగలరు. కాని కాలమును ఎవ్వరు అతిక్రమించలేరు. కాలం అన్నిటికన్న బలవత్తరమయినది. కాలమును అతిక్రమించడానికి వీలులేదు.

* * *

20. యావత్ భారతఖండానికి రాజు ధర్మరాజు. ఆయన తమ్ముడు దేవేంద్రుడి పుత్రుడు. అతను ధరించే విల్లు గాండీవం. అర్జునునికి సారథి మహామహి మాన్వితుడయిన యోగపురుషుడైన శ్రీకృష్ణుడు. బ్రహ్మాండమయిన గదపట్టుకొని ఉగ్రమూర్తియై భీముడు, అర్జునునికి తోడుగా వస్తూ వుంటాడు. ఇంతటి గొప్పవారికి ఎప్పడు కష్టాలు వస్తూనే ఉంటాయి. అదే కాల మహిమ. అందుకే చిన్న చిన్న కష్టాలకు కుంగి పోకుండా ధర్మం తప్పకుండా ఈశ్వర అనుగ్రహంతో ఆ కష్టాలను తట్టుకునే ధైర్యం పొందాలి.

* * *

21. పిల్లాడిని పేరుపెట్టి పిలిచినప్పడు హాస్యం కోసమయినా సరే, సరదా కోసమయినా సరే 'ఒరేయ్ మాధవా ఇలారా (ఈశ్వర నామము ఏదయినా సరే)' అన్నా సరే - ఈశ్వరుడి పేరు తలవగానే నీలో వున్న పాపం పోతుంది. నామమునకు ఉన్న శక్తి అటువంటిది. నామము అంత గొప్పది. పేరుపెట్టుకోవడంలో ఉంది అదృష్టం.

* * *

22 ఏకదాశి నాడు దేవాలయ సమీపంలోగాని, పవిత్ర స్థలంలోగాని, గోశాలలోగాని భాగవతమునందు భీష్మచరిత్రను చదివిన, వినిన తర్వాత విష్ణు సహస్రనామ పారాయణం చేసిన వారికి ఎంతో పుణ్యం వస్తుంది.

* * *

23. శాస్త్రనియమము ప్రకారం కన్నకూతురయినా సరే అయిదు సంవత్సరాలు దాటిన తరువాత కూతురు నిద్రపోతుంటే తండ్రి ఆ గదిలోకి వెళ్ళడం నిషిద్ధం. తండ్రితో కలిసి కూతురు ఏకశయ్యయందు నిద్రించడం నిషిద్ధం.

*  *  *

24. కోపానికి ఒక హద్దు ఉండాలి. లేకపోతే ఆ కోపము క్రోధముగా మారుతుంది. ఆ వ్యగ్రతలో నుంచి  మన పతనం ప్రారంభమవుతుంది.

*  *  *

25. మనిషి ఒక స్థితిని పొందాక వేరొకడి మాట వినడు.  వాడు చెప్పేదేంటి నేను వినడం ఏంటి అనుకుంటాడు. అలా వినగలడం చాలా గొప్ప విషయం.

*  *  *

26. ధ్రువోపాఖ్యానమును దేవాలయం సమీపంలోకూర్చోని, దిన ప్రారంభమునందుగాని,  అసురసంధ్యకాలంలోగాని, అమావాస్య నాడుగాని, పూర్ణిమనాడుగాని, ద్వాదశినాడుగాని, శ్రవణ నక్షతమున్నప్పుడు గాని, దినక్షయమందు(ఒక రోజులో ఒకతిథితో ప్రారంభమయి అదే తిథిలో అంతమయ్యే రోజు)గాని ఎవరు భక్తితో వింటారో వారికి వెంటనే కొన్ని కోట్ల జన్మల పాపం నశించిపోతుంది.

*  *  *

27. మిత్రుడిని సరియైన వాడిని పెట్టుకొనక పోయినా, కనపడిన ప్రతివానితో మీరు స్నేహం చేసినా మీకు జీవితంలో సుఖం అన్నది ఉండదు. వాడు పాడు చేస్తాడు. అందుకని పుత్రుడు, భార్య, భోజనం, మిత్రుడు - ఈ నాలుగు మంచివి దొరకని వ్యక్తికి జీవితంలో చాలా నష్టం జరుగుతుంది.

*  *  *

28. పాణిగ్రహణం సమయంలో మంత్రం చెప్పేటప్పుడు వధూవరులు అరచేతిని, అరచేతితో వేళ్ళుకూడా బాగా తగిలేటట్టు పట్టుకుంటే కొడుకులు, కూతుళ్ళూ పుడతారు. ఒక్క వేళ్ళు మాత్రమే తగిలితే కూతుళ్ళు పుడతారు. అరచేయి ఒక్కటే తగిలి వేళ్ళు తగలకపోతే కొడుకులు మాత్రమే పుడతారు. పాణిగ్రహణమంత్రమునకు అంత శక్తి ఉంది.

*  *  *

29. ఈశ్వరుడి పైభాగము తలనుంచి బ్రాహ్మణులు, భుజముల నుంచి క్షత్రియులు, ఉదరభాగం నుంచి వైశ్యులు, క్రింది భాగం నుంచి శూద్రులనే చతుర్వర్ణాలను సృష్టించారు. అందుకే బ్రాహ్మణులు ఎప్పుడూ వేదపఠనం

చేస్తూ లోకానికి, నీతిని, ధర్మాన్ని చెబుతూ, యజ్ఞాలు, యాగాలు చేస్తుంటారు. క్షత్రియులు ఎప్పుడూ చెడును నిగ్రహిస్తూ, మంచిని కాపాడుతూ పరిపాలన చేస్తూ, యజ్ఞాది యాగాల సంరక్షణ చేస్తారు. వైశ్యులు న్యాయమైన రీతిలో వ్యాపారం చేస్తూ మిగతా మూడు వర్ణాలకు కావలసిన అర్థాన్ని సంపాదించి దైవకార్యాలకు నిర్వహణ ఖర్చును సమకూరుస్తారు.. చతుర్ వర్ణం వారు వారియొక్క వృతి నైపుణ్యం ఒక్కొకరు ఒక్కొక విధంగా ఈశ్వరుడికి సేవ చేస్తారు.

* * *

30. ప్రపంచమునందు పెద్దలు కుదిర్చిన మొట్టమొదటి వివాహము కర్థమ ప్రజాపతి-దేవహూతిల వివాహము.

* * *

31. కపిల గీత

కపిల మహర్షి తన తల్లితో అంటున్నాడు 'అమ్మా, ప్రపంచములో అనేక జీవరాసులున్నాయి. అందులో ప్రధానముగ మనుష్యజన్మ చాలా గొప్ప జన్మ.

ఈ దేహములో పొందిన వాటిలో ప్రాణములు కలిగినవి మొదట శ్రేష్ఠములు. చెట్లకి ప్రాణం ఉన్నా చెట్లకన్నా గొప్పది స్పర్శజ్ఞానమున్నవి. స్పర్శజ్ఞానమున్న వాటికంటే రసజ్ఞానమున్నవి (రుచితెలిసినవి) గొప్పవి. రసజ్ఞానమున్న వాటికంటే వాసనకూడా చెప్పగలిగే భృంగములు గొప్పవి. వాటికంటే శబ్దమును వినగలిగే పక్షులు గొప్పవి. వాటికంటే అనేక పాదములున్న జంతువు గొప్పది. ('శరభము'నకు ఎనిమిది పాదాలుంటాయి). దానికన్న నాలుగు పాదాలున్న ఆవు, గేదె, మేక మొదలయినవి గొప్పవి. వాటికన్న రెండు పాదాలున్న మనిషి గొప్పవాడు.

* * *

32. ఇరువై నాలుగు తత్వాలు. అవి

మహాభూతములు : ౧.భూమి ౨.వాయువు ౩.ఆకాశం ౪.నీరు ౫.అగ్ని

కర్మేంద్రియాలు : ౧.కాళ్ళు ౨.చేతులు ౩.నోరు ౪.మలద్వారము ౫.మూత్రద్వారము

అయిదు జ్ఞానేంద్రియాలు : ౧.కళ్ళు ౨.ముక్కు ౩.చెవి ౪.నాలుక ౫.చర్మము

ఇంద్రియలౌల్యాలు : ౧.చూపు ౨.వాసన ౩.వినికిడి ౪.రుచి ౫.స్పర్శ

సంకల్ప వికల్ప సంఘాతాలు రెండు, చిత్తము, అహంకారము.

వీటిని మాయ కప్పివుంచటం వల్లన ఇందులోవున్న ఈశ్వరున్ని మనం చూడలేకపోతున్నాం.

* * *

33. మీరు భక్తి మొదలుపెట్టండి - భక్తిచేత మిమ్మల్ని మీరు పరిశీలన చేసుకోండి - అప్పుడు వైరాగ్యం వస్తుంది - భక్తి వైరాగ్యం కలిసి జ్ఞానం వస్తుంది - జ్ఞానం వచ్చిన తరువాత మీ స్వస్వరూపం మీకు భాసిస్తుంది.- మీ స్వస్వ రూపమునందు మీరు నిలబడితే మీకు మోక్షం వస్తుంది.

* * *

34. సాధారణంగా అధికారుల దగ్గరకు చేరేవారిలో నిరంతరము పొగిడేవారు ఉంటారు. వారు గోతిని తీసి గడ్డికప్పినవారిగా మనం గుర్తించాలి. వారు పొగిడి గోతిలోకి తోస్తారు. నిజంగా మేలుకోరేవాడు మనస్సుకి అప్రియంగా అనిపించినా, యథార్థము నొక్కదానినే తీసుకువచ్చి మాట్లాడతాడు. అలా మాట్లాడేవాడు మీకు దొరకమన్నా దొరకడు. దొరికినా అతని మాటవినేవారు ఉండరు. అలా దొరకితే వారి జీవితం మారిపోయినట్లే!

* * *

35. శివాభిషేకం చేసేటప్పుడు నియమాలు :

౧.శివలింగంమీద పువ్వు బోర్లించి అభిషేకం చెయ్యాలి.

౨. ప్రారంభమునందు పాడి విభూతితో మొదలుపెట్టాలి.

౩.చివరలో గంధోదకంతో పూర్తి చెయ్యాలి.

౪. ప్రతి పదార్థమునకు మధ్యలో మరల శుద్ధజలంతో అభిషేకం చెయ్యాలి.

౫. దగ్గడం, తుమ్మడం. ఆవలించడం లాంటివి చేయకూడదు. శరీరంలో ఎటువైపు నుంచి వాయువు బయటకు వెళ్ళకూడదు.

౬. ఎవరితోనయినా లౌకిక సంభాషణచేస్తే ఇప్పటివరకు నీవు చేసిన పుణ్యం వాళ్ళ ఖాతాలోకి వెళ్తుంది. అలాకాకుండా ఉండాలంటే అప్పుడు కుడిచెవిమీద చేయి వేసుకుని మరల అభిషేకం చెయ్యాలి.

* * *

## అంకెల లెక్క

రామ రావణయుద్ధంలో పాల్గొన్న సుగ్రీవుడి వానర సైన్యం మొత్తం సంఖ్య : 256842399744000

కురుక్షేత్రంలో అర్జునుని చేతిలో చనిపోయిన సైనికుల సంఖ్య: 4723938

43లక్షల 20 వేల మానవ సంవత్సరాలు బ్రహ్మగారికి ఒక పగలు

36. యమధర్మరాజు తన భటులతో ఇటువంటివారిని తొలుతకట్టి తీసుకు రమ్మన్నారు. వారు

౧. వేళాకోళమునకయినా నారాయణా అని పలుకక, ఇంకొకరు ప్రసాదమును తెచ్చి ఇచ్చిన పుచ్చుకొనినవాడు.

౨. కలలో ఈశ్వరుని పాదములు కనపడనివాడు.

౩. అర్థతను మరచి పెద్దలు వ్రాసిన గ్రంథములు మీద తీర్పులు చెప్పేవాళ్ళు.

౪. పూజలయందు, కర్మలయందు వెట్టి అనుమానములు ఎక్కువయి, మనస్సు ఈశ్వరుడి దగ్గర పెట్టనివారు.

౫. గుడిలోని దేవుని దర్శించనివాళ్లను, దేవుని ఉత్సవం జరుగుతున్నప్పుడు ఆ ఉత్సవం చూడడానికి అడుగు తీసి అడుగుపెట్టని దుర్మార్గులను.

౬. మహాభాగవతులయిన పాదముల అడుగునవున్న ధూళి కణములను ఆశ్రయించి సమస్త తీర్థములు ఉన్నాయని తెలుసుకోలేక వారిముందు వంగి నమస్కరించలేక ధ్వజస్తంభములా నిలబడిపోయిన దౌర్భాగ్యులను త్వరగా యమలోకానికి తీసుకురమ్మని అన్నారు.

* * *

37. మనకి నవవిధ భక్తులు ఉన్నాయి. ఈ తొమ్మిది మార్గాల ద్వారా ఈశ్వరుణ్ని సేవించవచ్చు.

౧. శ్రవణం : వినుట (పరీక్షిత్తుమహారాజులా వినాలి)

౨. కీర్తనం : పరవశించి చెప్పకోవడం. (శుకమహర్షిలా భాగవతం చెప్పడం)

౩. స్మరణం : తలుచుకోవడం (ప్రహ్లాదుడిలా ఈశ్వరుణ్ణి తలుచుకోవాలి)

౪. పాదసేవనం : పాదములను సేవించడం. (లక్ష్మీదేవిలా స్వామిని సేవించడం)

౫. అర్చనం : పూజచేయడం (పృథుమహారాజుగారిలా పూజచేయడం)

౬. వందనం : నమస్కారం చేయడం (అక్రూరుడిలా నమస్కారం చేయడం)

౭. సఖ్యం : స్నేహం (అర్జునునిలా స్నేహం చేయడం)

౮. దాస్యం : సేవ చేయడం (ఆంజనేయునిలా దాస్యం చేయడం)

౯. ఆత్మనివేదనం : దీనికి ఉదాహరణగా బలిచక్రవర్తిని చెపుతారు.

* * *

## అష్టకష్టాలు

1. అప్పపడి వుండటం 2.అడుక్కోవడం 3. ముసలితనం 4. దొంగతనం 5. జారత్వం 6. దరిద్రం 7. రోగం 8. మరొకరు తినగా మిగిలింది, తిని వదిలేసింది తినవలసిరావడం.

38. ఎవరు పృథుమహారాజుగారి చరిత్రవింటారో వారికి కలిగే ఫలితాలు. సంధ్యావందన చేయడం మానివేసినవారికి ఆ దోషం నివారణ అయి బ్రహ్మవర్చస్సును పొందుతారు. వైశ్యులకు వారి వ్యాపారంలో అనేకమయిన లాభములుకలిగి ధనసంపత్తిని పొందుతారు. పెద్దలను సేవించేతత్త్వము ఉన్నవారు పెద్దల అనుగ్రహము పొంది వారి కుటుంబములు వృద్ధిలోకి వస్తాయి. ఎంత చేతకానివాడు, ఏమీ తెలియనివాడు కూడా ఈ చరిత్ర వింటారో వారికి సర్వసిద్ధులను పొంది సర్వపాపములు నశించి శ్రీకృష్ణ పరమాత్మ పాదారవిందముల యందు భక్తికలిగి, మోక్షస్థితికి కావలసిన జ్ఞానాన్ని పొందుతారు.

*　　*　　*

39. మనం ఏది అనుభవించినా ఏది చేసిన దానికి వేదమే ప్రమాణము అయివుంటుంది. ఈశ్వరుడు లేడన్నవాడిని నాస్తికుడు అనరు. వేదము ప్రమాణము కాదన్నవాడిని నాస్తికుడు అంటారు. వేదము ప్రమాణము కాదని సొంతనిర్ణయం తీసుకుని ప్రవర్తించినవారిని నాస్తికులు అని పిలిస్తారు. అందుకే వేదము కనపడినా వేదపండితుడు కనపడినా వెంటనే నమస్కరించాలి.

*　　*　　*

40. సత్యము అంటే మారనిది. ధర్మము అంటే మారునది. ఒక వ్యక్తి కూర్చుని ధర్మప్రసంగం చేసేటప్పుడు పౌరాణిక ధర్మం పాటిస్తాడు. తండ్రిగారితో మాట్లాడుతున్నప్పుడు పుత్ర ధర్మమును పాటిస్తాడు. దేవాలయమునకు వెళ్ళి స్వామికి నమస్కరిస్తున్నప్పుడు భక్తి ధర్మమును పాటిస్తాడు. ఇంట్లో కూతురివద్ద పితృధర్మమును పాటిస్తాడు. భార్య దగ్గర భర్తృ ధర్మమును పాటిస్తాడు. ఇలా ఒకవ్యక్తి అనేక ధర్మములను పాటిస్తూ ఉంటాడు. మారిపోతున్న ధర్మమును పట్టుకొని మారని సత్యము(ఈశ్వరుడు)లోకి వెళ్ళాలి.

*　　*　　*

41. 'నేను కాని తలుచుకున్నానంటే సాక్షాత్తు ఈశ్వరుడు వచ్చినా లొంగను', 'ఈ విషయం మూడోకంటివానికి తెలియకూడదు' అనే పదాలు వాడకూడదు. వీటిని కూడా మహాపాపంగా పరిగణిస్తారు.

*　　*　　*

కృతయుగం పది సంవత్సరాలలో పొందిన పుణ్యం - త్రేతాయుగంలో ఏడు నెలలకే పుణ్యం వస్తుంది. -ద్వాపర యుగంలో పదిహేను రోజులకే వస్తుంది - కలియుగంలో ఒక క్షణం భక్తితో చేస్తే వస్తుంది.

42. ఎవడు ఈశ్వరుని నమ్మాడో వానికి ఈశ్వరానుగ్రహం కలగడానికి అమ్మవారి స్వరూపంగా ఆడపిల్ల పుడుతుంది. ఆడపిల్లవున్న ఇంటికి ఉన్న సంస్కారము ఆడపిల్లలేని ఇంటియందు ఉండదు. ఆడపిల్లకు ఉన్న ఆప్యాయత ఎవరికీ ఉండదు. ఆడపిల్ల హృదయం తెలిసిన భర్తవుంటే వారి దాంపత్యం పరిపుష్టం అవుతుంది.

* * *

43. ఎవరు సరైన మార్గంలో, వైదిక సంప్రదాయంగా, మహాసంకల్పం చెప్పి వరుణ్ణి నారాయణునిగా తలచి కన్యాదానం చేస్తారో అతనికి కలిగే ఫలితం. ఇక్కడి నుంచి బ్రహ్మలోకమునకు నువ్వులగింజలు పేర్చుకుంటు వెడితే, అ నువ్వుల గింజలు ఎన్ని ఉంటాయో అన్ని సంవత్సరాలు వారికి బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది.

* * *

44. భాగవతములో సప్తసముద్రాల పేర్లు. ౧. లవణ సముద్రము ౨. ఇక్షు సముద్రము ౩. సురాసముద్రము ౪. దధిసముద్రము ౫. మండోదసముద్రము ౬. శుద్ధోదక సముద్రము ౭. ఘృతసముద్రము.

* * *

45. భాగవతములో సప్తద్వీపముల పేర్లు. ౧. జంబూ ద్వీపము ౨. ప్లక్ష ద్వీపము ౩. శాల్మలీద్వీపము ౪. కుశద్వీపము ౫.క్రౌంచద్వీపము ౬. శాక ద్వీపము ౭. పుష్కర ద్వీపము.

* * *

46. కుక్కను పవిత్ర స్థలములోకి రానివ్వకూడదు. దేవాలయములలోనికి గాని, పూజగదిలోనికి గాని ప్రవేశిస్తే ఆ రోజున దేవతలు నివేదన స్వీకరించరు. (11.10 నుంచి 11.30)

* * *

47. మనకు అయిదుగురు గురువులు ఉంటారు. వారు :

౧. సూచక గురువు : మనకు చిన్నతనంలో పాఠం చెప్పినవారు.

౨. వాచక గురువు : ఒక ఆశ్రమమును నిర్మాణం చేసినపుడు మనం దానిలోకి వెళ్లగానే దాంట్లో నియమాలు చెపుతారు.

౩. బోధక గురువు : మంత్రోపదేశం చేసిన గురువు.

౪. పరమ గురువు : శంకరాచార్యులు, చంద్రశేఖర పరమచార్యుల వంటి మహాపురుషులు.

౫. నిషిద్ధగురువు : ఈయన ఉండకూడని గురువు. ఆయన వద్ద ఏవిధమయిన ఉపదేశములు తీసుకొనకూడదు. (ఉగ్రపూజలు మొదలయినవి చెప్పే గురువులు)

48. బ్రహ్మస్థానంలో(బ్రాహ్మణుడు) అపచారం జరిగితే శ్రీమహావిష్ణుమూర్తికి మొక్కితేపోతుంది. విష్ణుమూర్తి (పాలకుడు) స్థానంలో అపచారం జరిగితే పరమశివుడికి మొక్కితేపోతుంది. పరమశివుడు (తండ్రి) స్థానంలో అపచారం జరిగితే గురువుకు క్షమాపణ చెప్పితే గురువు తియ్యగలడు. గురువు (విద్యను చెప్పేవాడు) స్థానంలో అపచారం జరిగితే మరల గురువు అనుగ్రహించి దానిని తీసివేసే వరకు దాని ఫలితము మరోజన్మ వరకు వెంట తరముతుంది. ఈశ్వరుడు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోడు. గురువుగారి విషయంలో అపచారం జరుగకపోయిన ఆయన బాధపడేలా ప్రవర్తించిన ఆ పాప ఫలితము మనల్ని తరుముతుంది.

* * *

49. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడికి, పరతత్త్వానికి, గురువుకి తేడా లేదు. చతుర్ముఖ బ్రహ్మగారి రూపమే తండ్రిగా ఉంటుంది. అందుకే తండ్రి ఉపదేశం చేస్తే బ్రహ్మోపదేశమే! సోదరుడు ఇంద్రుని రూపంలో ఉంటాడు. అన్నగారిని సేవిస్తే దేవేంద్రుని సేవించినట్టు. అమ్మ భూదేవి రూపం. అందుకే అమ్మకున్న ఓపిక ఎవరికి ఉండదు. తోడబుట్టిన అక్కచెల్లెళ్ళు సాక్షాత్తు రాశీభూత మయిన దయాస్వరూపములు. తన భావమే ధర్మస్వరూపం. అభ్యాగతుడు అగ్నిదేవుని రూపం. సర్వభూతములు కేశవుని రూపములు.

* * *

50. ఇంద్రుడు తన గురువైన విశ్వరూపుని మూడు తలలను నరికినప్పుడు అందులో ఒకతల తీతువుపిట్ట అయింది. ఆ తీతువు పిట్ట కూత వినపడితే అమంగళము. ఆ అమంగళము ఒక్క కృష్ణస్మరణంచేత మాత్రమేపోతుంది.

* * *

51. గురువును చంపినందుకుగాను ఇంద్రుని వెంటపడిన బ్రహ్మహత్యా పాతకమును నలుగురు పుచ్చుకున్నారు. వారు భూమి, చెట్లు, నీరు, స్త్రీలు. అందుకు వారికి ఇంద్రుడు కొన్ని వరాలు ఇచ్చారు. అవి

౧. భూమిమీద ఎవరయినా గొయ్యి తీస్తే ఆ గొయ్యి కొంతకాలమునకు తనంత తాను పూడుకుపోతుంది.

౨. ఎవరయినా చెట్లను నరికేసినా దాని మొదలు ఉంటే చాలు అది మరల చిగురిస్తుంది.

౩. ఏపనిచేసినా దానిని శుద్ధిచేసుకునే శక్తి ఒక్క నీరుకు మాత్రమే ఉంటుంది.

౪. కామోపభోగములందు ఎక్కువ సుఖము కలిగేటట్లు స్త్రీలకు వరం ఇచ్చాడు.

బ్రహ్మహత్యాపాతకము వలన వీరికి కలిగిన వికారములు.

౧. భూమిమీద ఇసుక పర్రలు ఏర్పడ్డాయి. దానిమీద మొక్క మొలవదు.

౨. చెట్లలోంచి జిగురు కారుతుంది. అందుకే చెట్టు జిగురు వికారము స్పృశించకూడదు.

౩. నీటియందు బుడగలు, నురగలు రావడం. ఆచమనం చేసేటప్పుడు నీటిలో బుడగ ఉంటే ఆ నీళ్లని పక్కకి వదిలిపెట్టేస్తారు. కొత్తగా ప్రవాహం వచ్చేముందు పెద్ద పెద్ద నురగలు వస్తాయి, అ నురగలను ముట్టకోకూడదు, దానిలో స్నానం చేయకూడదు.

౪. స్త్రీలయందు రజోగుణదర్శనము బ్రహ్మహత్యా పాతకరూపం.

* * *

52. భాగవతం ప్రకారం ఈశాన్యదిక్కు కేవలము దైవసంబంధమయిన దిక్కు. అందుకే మన ఇంట్లో పూజా మందిరమును ఈశాన్యంమూల పెడతాము. ఒకవేళ అక్కడ ఏమీపెట్టకపోయినా ఈశాన్యమూల ఈశ్వరుని శిరస్సు ఉంటుంది అని చెపుతారు. అందుకని ఈశాన్యమున బరువు పెట్టకుండా ఖాళీగా ఉంచాలి అని అంటారు.

* * *

53. మనకు జీవితంలో భద్రత కావాలంటే వీటిజోలికి వెళ్లికూడదు.

౧. ఏకోరిక లేకుండా భగవంతుడినే నమ్ముకుని తిరుగుతున్న సాధుపురుషులను కించపరచడం, బాధపడటం చెయ్యకూడదు.

౨. దేవతలపట్ల అపచారములను చేయడం, పేర్లుపెట్టడం, నిందించడం చేయ్యకూడదు. మీకు తెలిసినా తెలియకపోయినా ఒక నమస్కారం చెయ్యాలి. ప్రయత్నం పూర్వకంగా దేవతలను అధిక్షేపించకూడదు.

౩. శ్రుతి అనగా వేదము. వేదమును ఎన్నడూ కించపరిచి మాట్లాడకూడదు. అలా మాట్లాడితే ఆ పాపం కాల్చేస్తుంది.

౪. ఆవులను ఎప్పడూ బాధపెట్టకూడదు. ఆవుపట్ల పరమమర్యాదతో ప్రవర్తించాలి.

౫. బ్రాహ్మణులయందు గౌరవంతో ఉండాలి, తెలిసి కూడా ధర్మం తప్పడం.

౬. ఏ ఈశ్వరుడు నోరిచ్చి శక్తి ఇచ్చాడో ఆ ఈశ్వరునే నిందచేయడం, ఆ ఈశ్వరుని ప్రసాదం తినకపోవడం.

ఇటువంటి పనులు చేసిన వారికి భయంకరమైన మరణమొస్తుంది.

* * *

54. ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశిపుడితో ఇలా అన్నాడు :

పుట్టుగుడ్డివాడిని తీసుకువెళ్ళి పున్నమిచంద్రునిదగ్గర కూర్చోబెట్టి పున్నమిచంద్రుడు ఎంత అందంగా ఉన్నాడో చూడరా అంటే ఎంత అసహ్యమో ఈశ్వరుడిని విడిచిపెట్టి సంసారం చాలా బాగుంది అనుకోవడం అంత అసహ్యకరం. మరొకడు పుట్టుకతో చెవిటివాడు. వాడి చెవిదగ్గర శంఖం ఊది శంఖనాదం బాగుందా అని అడిగితే వాడేమి చెప్పగలడు! ఒక వ్యక్తి చదువుకొని, మహాప్రాజ్ఞుడయినను ఈశ్వరానుగ్రహంలేక మూగవానిగా పుట్టాడు. ఆయనను ప్రవచనం చేయమని అడిగితే ఎలా ఉంటుందో? నపుంసకుడయిన వాడికి స్త్రీమీద కలిగిన కోర్కె ఎలా ఉంటుందో? పందిని తీసుకువెళ్ళి పన్నీరురాస్తే ఎలా ఉంటుందో? అది వెంటనే మరల మురుగుకాలువలోనికి దూకేస్తుంది. గొప్ప ఐశ్వర్యవంతుడయినప్పటికీ ఎవరికి దానం ఇవ్వడు - అటువంటి పిసినారి దగ్గర ధనం ఎంత అక్కరకు వస్తుందో అటువంటిది - చేసినమేలు మరిచిపోయే కృతఘ్నునితో బంధుత్వము - ఇవన్నీ ఎలా ఉంటాయో ఒక్క భగవంతుడిని విడిచిపెట్టి మిగిలినవన్నీ పట్టుకుంటే ఎలా ఉంటాయో అలా ఉంటుంది.

*   *   *

55. ఎట్టి పరిస్థితులలో దేనిమీదకూర్చుని తాగడంకాని, తినడంకాని చేయకూడదో కనీసం దాని మీదపడుకుని మాత్రకూడా వేసుకోకూడదో ఆ వస్తువునకే మంచము అని పేరు. మంచమనేదానికి రజోగుణ, తమోగుణ, పాప సంబంధము ఉంటుంది. మంచం మీద ఏ పూజనీయమయిన వస్తువును పెట్టకూడదు. దైవ అష్టకములు, స్తోత్రములు మంచము మీదపడుకుని చదవకూడదు. అందుకే ఒక వయసు వచ్చిన తర్వాత పెద్దలు మంచం వాడకుండా భూశయనం చేస్తారు.

*   *   *

56. హలాహల భక్షణం (శివుడు విషం మింగడం) కథ వినిన వాళ్ళకి మూడు ప్రమాదములు జరగవు. వాళ్ళను పాము కరవదు, తేలు కుట్టదు, అగ్నిహోత్రంలో కాలిపోయే ప్రమాదములు రావు.

*   *   *

57. ఏ పూజనయినా, అగ్రపూజ అని ముందు పెద్దవారికి నమస్కారం చేసి మొదలుపెట్టాలి. అప్పుడు విఘ్నం రాకుండా ఆయన ఆశీర్వచనం చేస్తాడు. ఆ ఆశీర్వచనబలం కాపాడుతుంది.

*   *   *

58. తల్లిచేప దగ్గరికి ఎదురుగుండా చేపపిల్లలు వచ్చి 'అమ్మా ఆకలేస్తుంది' అంటే ఆ తల్లి చేప పరమదయతో తన కంటి చూపుతో పిల్లల ఆకలి తీర్చేస్తుంది. ఇదే లక్షణం తాబేలుకు ఉంది. అలాగే అమ్మవారిని సంతోషంతో ఒక్క స్తోత్రం చేస్తే అమ్మ పరమసంతోషంతో మనవైపు చూస్తుంది. ఆ చూపుతో మన కోర్కెలు తీరిపోతాయి. అందుకే అమ్మవారికి 'మీనాక్షి' అని పేరు.

* * *

59. పుట్టింటివాళ్ళు ఆడపిల్లకి పెట్టిన పేరు మార్చాలంటే పిల్ల తల్లిదండ్రులే వివాహంలో ఒక క్రతువు చేసి మార్చాలి. అలా కాకుండ తల్లిదండ్రులు భగవత్సంబంధమయిన పేరు పెట్టినప్పుడు అత్తవారింటి వైపువారు ఆ పేరుపెట్టి పిలవకుండా వారికి తోచిన ఏదో పేరు పెట్టి పిలవడం మొదలుపెడితే అది దోషమవుతుంది. ఆ దోషం వలన అక్కడితో వంశం అగిపోయే ప్రమాదముంది.

* * *

60. ఏ మనిషయినా పూర్తి మంచివాడు కాని పూర్తి చెడ్డవాడు కాని ఉండడు. చాలా చెడ్డవాడిలా కనిపించేవాడిలో కూడ ఏదో ఒక మంచి ఉంటుంది. అసలు మంచితనం లేనివాడు ఉండడు. పెద్దలయినవారు తన కిందనున్నవారు చెడుచేస్తే దానిని సవరించి వారిని మంచిమార్గమువైపు నడిపించగలవారయి ఉండాలి. అలా నడిపించగలిగితే వారు సరియైన పెద్దలని అనిపించుకుంటారు. మీకు లేని నడవడిని ఇతరులకు చూపించలేరు.

* * *

61. కామము (కోర్కెలు) ఎక్కడ ఎక్కువవున్నాయో అక్కడ కలహాలు, క్రోధములు బాగా ఉంటాయి.

* * *

62. పంక్తిలో భోజనమునకు కూర్చున్న వ్యక్తిని లేపి మరొకచోట కూర్చోమని అనరాదు. అతనికన్నా ఎంత గొప్ప వ్యక్తి వచ్చినా ఒకసారి కూర్చున్న వ్యక్తిని లేవమనకూడదు. అతనికి వడ్డించననికాని, పెట్టననికాని అనడానికి వీలులేదు. ఈ తేడాలను చూపడం శాస్త్రమునందు పరమదోషం.

* * *

63. ఇంట్లో ఎక్కువ దేవతల ఫోటోలు ఉండడంవలన పాపచింతన. చెడు చెయ్యాలనే ఆలోచన, రెచ్చగొట్టే పనులు తగ్గిపోయి మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

* * *

64. తండ్రి తన కర్తవ్యమును తాను నిర్వహిస్తూ తన ఇంట్లో తన పని తాను చేస్తుంటే - బిడ్డలపట్ల భార్యపట్ల ఉండవలసిన రీతిలో ఉంటే సమస్యలు ఉండవు. భార్య అంటే దాసిగా చూడటం కాదు. నీ ఆత్మ ఎటువంటిదో నీ భార్య అటువంటిది. నీ ఆత్మకు తెలియకుండా నీవేమీ చేయలేవు. అలాగే నీ భార్యకు తెలియకుండా నీవేమీ చేయరాదు. అందుకే శివుడు ఏమి చేసినా పార్వతీదేవికి చెపుతాడు. అలా చెప్పడం వలన మీకు తెలియకుండా మీ జీవితంలో మీ నడవడి దిద్దుబాటు అవుతుంది. భార్యతో ప్రవర్తించేటపుడు ఆత్మతో ప్రవర్తించినట్టు ప్రవర్తించమని శాస్త్రం చెపుతోంది.

* * *

65. ఇంటికి ఎవరైనా మహాత్ములుగాని, బ్రాహ్మణులుగాని వచ్చినప్పడు వారి కాళ్లను ఇంటి యాజమాని భార్య స్వయంగా తెచ్చిన నీటితోనే యజమాని కడగాలి. లేకపోతే ఆ పుణ్యఫలితం నీరు తెచ్చిన వారి ఖాతాలోకి వెళుతుంది.

* * *

66. ఎవరైనా స్థలం కొన్నప్పడుకాని, భూదానం పుచ్చుకున్నప్పడు కాని యాజమాని వెళ్లి భూమిని చెప్పలులేకుండా కాళ్లతో కొన్ని అడుగులు నడవాలి. అలా చేయకపోతే భూమియొక్క ఆగ్రహానికి గురవుతారు.

* * *

67. బలిచక్రవర్తి శుక్రాచార్యులతో ఇలా అన్నాడు. "ప్రపంచములోనికి ఎంతోమంది రాజులు వచ్చారు. 'నాది నాదని ఇంత సంపాదించానని' అన్నారు వారేరి? ఏ కొద్దికూడా పట్టుకెళ్లినవాడు ఈ భూమిమీద లేడు.' కీర్తిని ఆశించి ఆనాడు శిబి మొదలయిన మహాపురుషులు అద్భుతమయిన దానములు చేశారు. వాళ్లు యశోశరీరులై నిలబడిపోయారు. అంతేకాని ఇవన్నీ నావని దాచుకుంటే ఈ రాజ్యం ఉండిపోతుందా! ఈ శరీరం ఉండిపోతుందా!'

* * *

68. పెద్దగా భక్తిలేనివాడు కూడా ఎందుకయినా మంచిదని భగవంతునికి ఒక నమస్కారం చేస్తూ ఉంటాడు. అదే భగవంతుడిని నమ్మినవాడి కాళ్లకు నమస్కారం చెయ్యాలంటే కొందరికి అహం అడ్డువస్తుంది. భాగవతుల కాళ్లకు దణ్ణం పెట్టాలంటే వినయం ఉండాలి.

* * *

69. ఏ దేవాలయమునకు వెళ్ళినా ఎక్కువ మంది అరటిపళ్ళు తీసుకు వెళ్ళడానికి రెండు కారణాలు.

౧. దుర్వాసోమహర్షి కోపానికి బూడిదయినా తన భార్య కందళికి ఇచ్చిన వరం. అందుకే అరటిపళ్ళకి మరోపేరు కందళి ఫలాలు. ఒకసారి అరటిచెట్టు నాటితే అ చెట్టు అంతమయ్యే వరకు అది ఫలాలను ఇస్తూనే ఉంటున్నది. ఇది ఆయన వరం.

౨. ఏ ఫలాలైన మనం తినిపారేసిన గింజలలోంచి మళ్ళీ మొలకెత్తి ఫలాల్నిస్తాయి. అదే అరటిపండు తినేసిన తర్వాత అ తొక్కను భూమిలో పాతితే అది మళ్ళి మొలకెత్తదు. అందుకే అది పవిత్రమయిన ఫలం.

* * *

70. భాగవతంలో ఒకచోట ధర్మరాజుతో నారదుడు అంటాడు-

'గోపికలు కృష్ణునితో పెట్టుకున్న సంబంధము కామసంబంధము. కంసుడు, కృష్ణుడు తనను చంపేస్తాడేమోనని భయముతో ఆరాధించాడు. శిశుపాలుడు మొదలయిన రాజులు ఆయనతో శత్రుత్వమును పెంచుకున్నారు. వృష్ణివంశీయులందరు కూడా కృష్ణుడు తమకు బంధువు అనే అనుబంధమును పెంచుకున్నారు. పాండవులందరు ప్రేమతో ఆయనను ఆరాధన చేశారు. నారదాదులు ఆయనను భక్తితో ఆరాధించారు. ఏ రకంగా భగవంతునితో అనుబంధం పెట్టుకున్నా భగవంతుణ్ణి చేరతాము.'

* * *

71. ఎంతమంది బిడ్డలు పుట్టినా తల్లికి ఎప్పడూ బరువు కానట్లే, ఎన్ని ప్రాణులువున్నా భూమికి ఎప్పడూ బరువుకాదు. కాని ధర్మముతప్పి ప్రవర్తించే మనుష్యులను చూసి భూమి భారమని బాధపడుతుంది.

* * *

72. మనిషి ఆఖరి ఆలోచననుబట్టి ఈశ్వరుడు పునర్జన్మను యిస్తాడు. ఐశ్వర్యంమీద భ్రాంతివుండి చనిపోయినవాడికి తలపగిలిపోయి చచ్చి పోవలసిన జన్మను యిస్తాడు. తన భార్య పక్కన ఉండగా మరియొక స్త్రీ గురించి ఆలోచించేవాడు గోడమీద బల్లిగా వస్తాడని చెపుతుంది మార్కండేయ పురాణం.

* * *

73. ఉద్యోగం చేసేవాడు ఎప్పడో ఒకప్పడు పదవీవిరమణ చేయవలసి ఉంటుందని తెలుసు. టిక్కెట్టు కొన్నుకొని రైల్లో ప్రయాణం చేస్తున్నప్పడు మనం దిగవలసిన ఊరువచ్చినప్పడు దిగిపోవలసి ఉంటుందని తెలుసు. కాని ఏదో ఒకరోజున శరీరమును విడిచిపెట్టి వెళ్ళిపోవాలనే పరమ సత్యమును అంగీకరించరు. దానికై ఆరాటపడతారు. ఇక్కడ అజ్ఞానము వస్తోంది.

74. ఒక్క మనిషి తప్ప ప్రపంచంలో ఏ జీవికూడ తన తరువాతి తరమునకు దాచదు. పక్షులు రెక్కలు వచ్చేవరకే పిల్లలను పోషిస్తాయి. రెక్కలు వచ్చిన తరువాత పోషించవు. తరువాత తరమునకు దాచడమన్నది ఒక్క మనిషికే తెలుసు. సంసారంలో ఉన్నవాడు కొంతవరకు దాచుకోవడం తప్పు కాదు. కాని అది అర్థంలేని దాపరికం అయిపోతే అది తృష్ణ(తీరని దాహం)గా మారుతుంది. దానితో పాపాలు చేయడం మొదలెడతారు.

* * *

75. మనం ఒక వంద రూపాయలు సంపాదిస్తే అందులో కనీసం ఐదు రూపాయలు పుణ్యకార్యాలకుగాని, దానం చేయడం గాని చేస్తే ఆ పుణ్యం తర్వాతి జన్మలో దరిద్రం అనుభవించకుండా కాపాడుతుంది.

* * *

76. సరైన మార్గంలో కాని లేక అసలే డబ్బు సంపాదించకపోతే కలిగే నష్టాలు. తిట్టడం తెలియని అమ్మ ఒక వయసు దాటిన తర్వాత సంపాదించకపోతే తిడుతుంది. తండ్రి సంతోషంతో భుజం మీద చెయ్యి వెయ్యడు. అన్నదమ్ములు పలకరించరు. సేవకులను పిలిస్తే వాళ్ళు రారు. గౌరవించాల్సిన కొడుకు నిన్ను లెక్కచెయ్యడు. భార్య ప్రియమారా కౌగలించదు. మంచి హృదయంగల మిత్రుడు కూడ తప్పించుకొని తిరుగుతాడు.

* * *

77. కొందరు ఈశ్వరుడికి నైవేద్యం పెట్టనిదే భర్త 'ఆకలితో చచ్చిపోతున్నానే!' అని అన్నా సరే పెట్టరు. ఒక్కొక్కరు భగవంతుని ప్రసాదమునుయిస్తే 'ఈ వేళ శనివారం - ఉపవాసం ఉన్నాను - ప్రసాదమును తినను' లేదా 'ఈరోజు అన్నములాంటి పదార్థములను తినను' అంటారు. తొందరగా పూజ చెయ్యాలనే ఉద్దేశ్యంతో ఇతరుల మీద చిరాకు పడడంలాంటివి చేస్తారు. దీనినే మౌఢ్యం అంటారు. ఈ మౌఢ్యానికి అర్థం వుండదు. అంతగా ఫలితం వుండదు.

* * *

78. కొందరు పూజగదిలో దేవతామూర్తులను గోడకుపెట్టి అతికించేస్తారు. ఫోటో ప్రింటులను అతికించడం చేస్తారు. అది మంచి పద్ధతి కాదు. నేలమీద కాకుండా ఒక సింహాసనంలాంటిది పెట్టి దానిపై దేవతా విగ్రహాలను పెట్టి పూజచేయాలి.

* * *

79. స్నానం చేసేటప్పుడు ఒంటిమీద ఏదో ఒక వస్త్రం ఉండాలి. అలా లేకుండా దిగంబర స్నానం చేయకూడదు. అది జలాధిదేవత వరుణుడిపట్ల అపచారం.

* * *

80. సూర్యుడు ప్రకాశిస్తూవుండగా పగటిపూట రాత్రి జరిగిన దాంపత్యమునకు జరిగిన విశేషములను బహిరంగచర్చలు చేయకూడదు.

* * *

81. దేవాలయమలోనికి దర్శనముకు వెళ్ళినప్పుడు కొన్ని ప్రధాన నియమాలు పాటించకుండా దర్శనము చేసితే ఆ దర్శనము లెక్కలోకి వెయ్యరు. అవి.

౧. రాజ ద్వారం వద్ద వంగి నమస్కారించి వెళ్ళాలి.

౨. పరివార దేవతలనందరి దర్శించాలి. లేదా వారిని మనసులో నమస్కరించుకొని వెళ్ళాలి.

౩. ధ్వజస్తంభమును నమస్కారం చెయ్యాలి. అలా చేస్తే మనం వేదప్రమాణమును అంగీకరించినట్టు అవుతుంది.

౪. ఈశ్వరుడి దగ్గరకు వెళ్ళి మౌనంగా నిలబడి నమస్కారం చెయ్యాలి.

౫. ఈశ్వరుడికి నమస్కారం చేస్తున్న వేరొకరి పాదాలకు నమస్కారం చేయరాదు. ఆ ప్రాంగణములో ఉన్నవారిలో అందరికంటే పెద్ద ఈశ్వరుడు. అలాచేసే నమస్కారం స్వీకరించినవారుకూడా అపచారం చేసినట్టు అవుతుంది.

* * *

82. శివరాత్రినాడు సాయంకాలం నుంచి ఏదో ఈశ్వరసేవ(భజనకాని, నాట్యంకాని, పాటలు కాని) చేస్తూ అర్థరాత్రి 12గంటలకు లింగోద్భవం అయ్యాక అభిషేకం చేసిన వారికి చాలా గొప్ప ఫలితాలు వస్తాయి. సామాన్యంగా జన్మానికో ఒక శివరాత్రి అంటారు. ఆ ఆవకాశం చాలా అరుదుగా లభిస్తుంది.

* * *

83. వెలుతురు లేకపోతే చీకటి అంతటా అలుముకుంటుంది. అలుముకొని అన్ని వస్తువులను తనలోకి తీసుకుంటుంది. అప్పుడు ఏ వస్తువు ఏమిటో తెలియదు. తాడుకు, పాముకు తేడా తెలియదు. దుంగకు, దొంగకు తేడా తెలియదు. ఇలా తెలియకపోవడం వలన భయం ప్రారంభమవుతుంది. ఈ చీకటే అజ్ఞానం. జ్ఞానము (వెలుతురు)తో చూసినప్పుడు ప్రతిజీవిలో నీకు ఈశ్వరుడు కనిపిస్తాడు.

* * *

84. ఈశ్వరానుగ్రహం వున్నాగాని, నేను నిత్యం పూజలు చేస్తున్నానుగాని నా కోరిక తీరలేదని ఈశ్వర నిందచేయకూడదు. కొంత కాలం తర్వాత ఆ కోరిక ఎందుకు ఆయన నేరవేర్చలేదో మనకు అర్థమవుతుంది. అప్పడు ఆయన అనుగ్రహం ఏమిటో తెలుస్తుంది.

* * *

85. పూజ చేసేటప్పడు ధరశాస్త్రప్రకారము నవరంధ్రములలోంచి గాలి బయటకు వెడితే అక్కడితో పూజ పూర్తయిపోయినట్టే. అది పూర్తి పూజకాదు. అలాగే పూజమధ్యలో ఆవులింతవస్తే మరల సాన్నంచేసి వచ్చి పూజ ప్రారంభించాలి. లేదా కనీసం కుడిచెవిమీద కుడిచేయి వేసుకుని మరల పూజ చేయాలి. అలా చేస్తే స్నానం చేసిన ఫలితం అవుతుంది.

* * *

86. పెళ్ళికాని ఆడపిల్లలకు రుక్మిణికల్యాణం వినిపించినా, వారిచే చదివించినా వారికి పెళ్ళికి సంబంధించిన ఎన్ని గండాలు వున్నా అవి తొలగిపోయి మంచి వరుడు వచ్చితీరుతాడు.

* * *

87. తల్లిదండ్రులు తమ పిల్లలకు అప్పడప్పడు, ఎవరినైనా పెద్దలను ఇంటికి తీసుకొనివచ్చి పురాణ ప్రవచనం కాని, కొన్ని మంచి మాటలు చెప్పడం కాని, లేదా వారిని ఎక్కడైనా పురాణ ప్రవచనం జరిగినప్పడు తీసుకువెళితే వారికి మంచి అలవాట్లు, మంచి సంస్కారం నేర్పినవారు అవుతారు.

* * *

88. నాలుగు ఆశ్రమాలలో గృహస్థ ఆశ్రమమే గొప్పది. సన్యాసి కన్నా, వానప్రస్థ కన్నా, బ్రహ్మచారి కన్నా గృహస్తే గొప్పవాడు. గృహస్థ అశ్రమం లేనినాడు మిగతా ముగ్గురికి పోషణ లేదు. ప్రాణిసృష్టి సరిగా సాగదు. తక్కువ సమయంలో ఈశ్వర అనుగ్రహం కలుగుతుంది.

* * *

89 ౧. వేదాన్ని నమ్మి నిత్యాగ్నిహోత్రం చేయనివారు ౨. జీవితంలో ఎన్నడూ తీర్థయాత్ర చేయనివాడు. ౩. ఎప్పడూ అబద్ధాలు ఆడేవారు. ౪. వేదాలను నమ్మకుండా వేదాలపై అసత్య ప్రచారం చేసేవాడు. ౫. మాంసాహారం తినేవారు. ౬. యుద్ధంలో వెన్నుచూపించి శత్రువుతో పోరాడకుండా పారిపోయి వచ్చిన వారికి. ఇవి చేసిన వారు ఎంత గొప్పవారైనా, ఎన్ని పుణ్యకార్యాలు చేసినవారైనా వారికి స్వర్గలోకం ప్రవేశం లభించదు.

* * *

90. బాగా చీకటి పడిన తర్వాత తగినంత కారణం లేకుండా స్నానం చేయకూడదు. పడుకోబోయే ముందు స్నానం చేసి పడుకోకూడదు అది మంచి లక్షణం కాదు.

*　　*　　*

91. కాళ్ళు కడుకునేటప్పుడు ఒక పాదాన్ని ఇంకోపాదంతో రుద్దకూడదు. దేవతానుగ్రహం పోయి దరిద్రం వస్తుంది. అలాగే కాలు మీద కాలు వేసుకోవడం మంచిది కాదు. ఒకటి అవతలి వారిని అవమానించినట్లు, అది మనలోని అహనికి కారణమవుతుంది. అందుకే మనం పెద్దవాళ్ళ కాళ్ళు మొక్కుతాము. అలాగే పీఠాధిపతుల కాళ్ళు ముట్టుకోకూడదు. అలా ముట్టుకుంటే ఆ సన్యాసి ఆ రోజు భిక్ష చేయరు. అయన భిక్ష చేయని పాపఫలం మన ఖాతాలో వేస్తారు. (22.00 - 27.00)

*　　*　　*

### సీతారామ కల్యాణంలో వరుడి తరపున దశరథ మహరాజు, జనక మహరాజుల సమక్షంలో వశిష్టమహర్షి చెప్పిన రామచంద్రుని వంశవృక్షం

బ్రహ్మదేవుడు సృష్టికర్త → మరీచుడు→ కశ్యపుడు→ సూర్యుడు→ మనువు→ ఇక్ష్వాకుడు→ కుక్షుడు→ వికుక్షుడు→ బాణుడు→ అనరాణ్యుడు→ పృథ్వు→ త్రిశంకువు→ ధుంధుమారుడు→ మాంధాత→ సుసంధి→ ధృవసంధి, ప్రసేనజిత్→ భరతుడు→ అసితుడు→ సగరుడు→ అసమంజసుడు→ అమ్షుమంతుడు→ దిలీపుడు→ భగీరథుడు→ కకుస్తుడు→ రఘువు→ ప్రవర్ధుడు (కల్మషపాత్రుడు)→ సంఖనుడు→ సుదర్శనుడు→ అగ్నివర్ణుడు→ సిగ్రాగుడు→ మరుడు→ ప్రసుస్రుకడు→ అంబరీషుడు→ నహుషుడు→ యాయతి→ నాభాగుడు→ అజడు→ దశరథుడు→ రాముడు, భరతుడు, లక్ష్మణుడు, శతృఘ్నుడు.

### సీతమ్మవారి తండ్రి జనక మహరాజుయొక్క వంశవృక్షం

నిమి చక్రవర్తి → మిథి→ ఉథావస్తువు→ నంధివర్ధనుడు→ సుకేతువు→ దేవరాతుడు→ బృహత్రథుడు→ శురుడు, మహవీరుడు→ సుధృతి→ దృష్టకేతువు→ హరియస్వుడు→ మరుడు→ ప్రతింథకుడు→ కీర్తిరథడు→ దేవమీదుడు→ విబుధుడు→ మహిత్రకుడు→ కీర్తిరాతుడు→ మహరోముడు→ స్వర్ణరోముడు→ హ్రస్వరోముడు→ జనకుడు, కుశధ్వజుడు

## కాలమానం

ఇప్పుడు వాడుకలో ఉన్న సెకన్లు, నిమిషాలు, గంటలలగా పురాణాలలో వున్న కాలమానం ఇది.

6 రెప్పపాట్లు = ఒక విఘడియ, 60 విఘడియలు = ఒక ఘడియ
7.5 ఘడియలు = ఒక ఝాము, 8 ఝాములు = ఒక దినం
15 దినాలు = ఒక పక్షము, 40 దినాలు = ఒక మండలం
రెండు పక్షములు = ఒక నెల (1. కృష్ణ పక్షం, 2. శుక్ల పక్షం)
2 నెలలు = ఒక ఋతువు
(1. వసంతం 2. గ్రీష్మం 3. వర్ష 4. శరద్ 5. హేమంతం 6. శిశిరం)
3 ఋతువులు = ఒక ఆయనం
2 ఆయనాలు = ఒక సంవత్సరము (1. ఉత్తరాయనం 2. దక్షిణాయనం)
360 సంవత్సరములు = ఒక దివ్య సంవత్సరము (దేవతలకు ఒక సంవత్సరం)
43,20,000 మానవ సంవత్సరాలు = ఒక మహాయుగము
(నాలుగు యుగాలు కలిపితే ఒక మహాయుగము. అందులో
కృతయుగము 17 లక్షల 28 వేల సంవత్సరములు
త్రేతా యుగము 12 లక్షల 96 వేల సంవత్సరములు
ద్వాపర యుగము 8 లక్షల 64 వేల సంవత్సరములు
కలియుగము 4 లక్షల 32 వేల సంవత్సరములు.
కలియుగంలో ఇపుడు సుమారు 5,106 సం॥రాలు జరిగినది)
ఇలాంటి వేయి మహాయుగాలు బ్రహ్మదేవునకు ఒక పగలు
(ఈ పగలును కల్పము అంటారు)
మరో వేయి మహాయుగాలు బ్రహ్మదేవునకు ఒక రాత్రి
( ఈ రాత్రిని ప్రళయము అంటారు) ఒక బ్రహ్మ ఆయుష్షులో
14 మన్వంతరాలు, 15 మన్వంతరరాత్రులు ఉంటాయి.
71 మహాయుగములు కలిపితే ఒక మన్వంతరము అంటారు.
అలా ఇప్పుడు ఉన్న బ్రహ్మ (మహావిష్ణువు నాభి -లోంచి పుట్టినవారు)
కాలంలో ఇప్పటివరకు 6 మన్వంతరాలు గడిచి
7వ(వైవస్వత) మన్వంతరము నడుచుచున్నది.
అటువంటి బ్రహ్మదేవుని ఆయుష్షు 100 సంవత్సరములు
(864 కోట్ల మానవ సంవత్సరములు)

పరమశివుని మెడలో ఎన్ని కపాలలు ఉన్నాయో ఇప్పటివరకు అంతమంది బ్రహ్మలు పుట్టి, మరణించారు.

ఇంతకాలము జీవి జన్మలు ఎత్తుతూ పాప, పుణ్యములు అనుభవిస్తూ ఒక జన్మలో ఉంచి ఇంకో జన్మలోకి తిరుగుతూనే ఉండాలి. అందుకే ఈశ్వరుణ్ణి భక్తితో వేడుకొని మోక్షం ఇమ్మని కోరుకోవాలి.

# నిత్య పారాయణ శ్లోకాలు

## ప్రభాత శ్లోకం

**(ఉదయం నిద్రలేచిన తర్వాత రెండు చేతులను చూస్తూ చదవాలి)**

కరాగ్రే వసతే లక్ష్మీః కరమధ్యే సరస్వతీ ।
కరమూలే స్థితా గౌరీ ప్రభాతే కరదర్శనమ్ ॥

* * *

## ప్రభాత భూమి శ్లోకం

**(ప్రభాత శ్లోకం తర్వాత భూమాతకు నమస్కరిస్తూ చదవాలి)**

సముద్ర వసనే దేవి, పర్వత స్థన మండలే ।
విష్ణుపత్నిం నమస్తుభ్యం, పాదహాతిం క్షమస్తమే ॥

* * *

## సూర్యోదయ శ్లోకం (సూర్యుడికి నమస్కరిస్తూ చదవాలి)

బ్రహ్మస్వరూప ముదయ మధ్యాహ్నేతు మహేశ్వరమ్ ।
సాహం ద్యాయేత్సదా విష్ణుం త్రిమూర్తించ దివాకరమ్ ॥

* * *

## స్నాన శ్లోకం (స్నానం చేస్తూ చదవాలి)

గంగే చ యమునే చైవ గోదావరీ సరస్వతీ
నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు ॥

* * *

## భోజన పూర్వ శ్లోకం (భోజనానికి ముందు చదవాలి)

1. బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌబ్రహ్మణాహుతమ్ ।
   బ్రహ్మై వతేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినః ॥
2. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ-మాశ్రితః
   ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥
3. త్వదీయం వస్తు గోవింద తుభ్యమేవ సమర్పయే ।
   గృహాణ సుముఖో భూత్వా ప్రసీద పరమేశ్వర ॥

* * *

## భోజనానంతర శ్లోకం (భోజనం తర్వాత చదవాలి)

అగస్త్యం వైనతేయం చ శమీం చ బడబాలనమ్ ।
ఆహార పరిణామర్థం స్మరామి చ వృకోధరమ్ ॥

## సంధ్యా దీప దర్శన శ్లోకం

దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వతమోపహమ్ ।
దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమో స్తుతే ॥

* * *

## నిద్రా శ్లోకం

రామస్కంధం హనుమంతం వైనతేయం వృకోధరమ్ ।
శయనే యః స్మరేన్నిత్యమ్ దుస్స్వప్న-స్తన్యనశ్యతి ॥

* * *

## కార్యప్రారంభ శ్లోకం (ఏదైనా పనిని మొదలుపెట్టే ముందు చదవాలి)

వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభః ।
నిర్విఘ్నం కురు మే దేవ సర్వ కార్యేషు సర్వదా ॥

* * *

## గురు శ్లోకం

గురు బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥

* * *

## శ్రీరామ స్తోత్రం

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే ।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥

* * *

## సరస్వతి స్తోత్రం

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ ।
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా ॥

* * *

## లక్ష్మీశ్లోకం

లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీమ్ ।
దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురామ్ ।
శ్రీమన్మంధ కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరమ్ ।
త్వం త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియమ్॥

* * *

## శాంతి మంత్రం

అసతోమా సద్గమయా । - తమసోమా జ్యోతిర్గమయా ।
మృత్యోర్మా అమృతంగమయా। - ఓం శాంతిః శాంతిః :శాంతిః

# శ్రీరామనామ సంకీర్తనము

(ఈ క్రింది ప్రతి వాక్యానికి మకుటంగా 'శ్రీరామనామము రామనామము రమ్యమైనది రామనామము' అని కలిపి ప్రతిరోజూ కనీసం 11 సార్లు కీర్తనం చేయండి. మంచి శుభాలు కలుగుతాయి)

శ్రీమదఖిల రహస్యమంత్ర విశేషధామము రామనామము
దారినొంటిగ నడుచువారికి తోడునీడే రామనామము
నారదాది మహామునీంద్రులు నమ్మినది శ్రీరామనామము
కోరి కొలచిన వారి కెల్లను కొంగుబంగరు రామనామము
పాహి కృష్ణాయనుచు ద్రౌపది పలికినది శ్రీరామనామము
ఆలుబిడ్డల సౌఖ్యముకన్న అధికమైనది రామనామము
నీవు నేనను భేదమేమియు లేక యున్నది రామనామము
ఇడాపింగళ మధ్యమందున యిమిడియున్నది రామనామము
అండ పిండ బ్రహ్మాండముల కాధారమైనది రామనామము
గౌరికిది యుపదేశనామము కమలజుడు జపియించు నామము
గోచరంబగు జగములోపల గొప్పమైనది రామనామము
బ్రహ్మసత్యము జగన్మిథ్యా భావమే రామనామము
వాదభేదాతీతమగు వైరాగ్యమే శ్రీరామనామము
భక్తితో భజియించువారికి ముక్తినొసగు రామనామము
భగవదర్పిత కర్మపరులకు పట్టుబడు శ్రీరామనామము
ఆదిమధ్యాంతాది రహిత మనాది సిద్ధము రామనామము
సకల జీవులలోన వెలిగే సాక్షిభూతము రామనామము
జన్మమృత్యు జరాదివ్యాధులజక్కబరుచును రామనామము
ద్వేషరాగ లోభమోహములను ద్రెంచునది శ్రీరామనామము
ఆంజనేయుని వంటి భక్తుల కాశ్రయము శ్రీరామనామము
సృష్టిస్థితి లయకారణంబగు సూక్ష్మరూపము రామనామము
శిష్టజనముల దివ్యదృష్టికి స్పష్టమగు శ్రీరామనామము
సాంఖ్యమెరిగెడి తత్వవిధులకు సాధనము శ్రీరామనామము
యుద్ధమందు మహోగ్రరాక్షస యాగధ్వంసము రామనామము
రాకడయి పోకడయి లేనిది రమ్యమైనది రామనామము
ఆత్మసంయమయోగ సిద్ధికి ఆయుధము శ్రీరామనామము
నిర్వికారము నిర్వికల్పము నిర్గుణము శ్రీరామనామము

కోటిజన్మల పాపమెల్లను రూపుమాపును శ్రీరామనామము
సత్వ రజస్తమోగుణముల కతీతమైనది రామనామము
ఆగామి సంచిత ప్రారబ్ధములను హరియించునది శ్రీరామనామము
ఆశ విడచిన తృప్తులకు ఆనందమొసగును రామనామము
ప్రణవమను "ఓం" కార నాదబ్రహ్మమే శ్రీరామనామము
మనసు స్థిరముగ నిలుపగలిగెడి మంత్రరాజము శ్రీరామనామము
జన్మమృత్యు రహస్యమెరిగి జపించవలె శ్రీరామనామమము
విషయవాసన లెల్ల విడచిన విదితమగు శ్రీరామనామము
పసితనంబున నభ్యసించిన పట్టుబడు శ్రీరామనామము
సర్వమతములలోని తత్త్వసారమే శ్రీరామనామము
నిర్మలంబుగ శోధచేసిన నేర్వదగు శ్రీరామనామము
విజ్ఞుడగు గురునాశ్రయించిన విశదమగు శ్రీరామనామము
జీవితంబున నిత్యజపముగ జేయవలె శ్రీరామనామము
మరణకాలమునందు ముక్తికి మార్గమగు శ్రీరామనామము
పాలుమీగడ పంచదారల పక్వమే శ్రీరామనామము
ఎందరో మహానుభావుల డెందమాయెను శ్రీరామనామము
తుంటరి కామాదులను మంటగలుపునది శ్రీరామనామము
మేరుగిరి శిఖరాగ్రమందున మెరయుచున్నది శ్రీరామనామము
సిద్ధమూర్తులు మాటిమాటికి చేయునది శ్రీరామనామము
వెంటతిరిగెడి వారికెల్లను కంటిపాపే రామనామము
ముదముతో సద్భక్తిపరులకు మూలమంత్రము రామనామము
కుండలిని భేదించి చూచిన పండువెన్నెల రామనామము
గరుడగమనాదులకైన కడు రమ్యమైనది రామనామము
ధాతవ్రాసిన వ్రాత తుడిచెడి దైవమే శ్రీరామనామము
పుట్టతానై పాముతానై బుస్సకొట్టును రామనామము
అష్టదళముల కమలమందున నమరియున్నది రామనామము
అచలమై ఆనందమై పరమాణువైనది శ్రీరామనామము
జపతపంబుల కర్తమైనది జగతిలో శ్రీరామనామము
జ్ఞానభూముల నేడు గడచిన మౌనదేశము శ్రీరామనామము
తత్త్వ శిఖరమునందు వెలిగే నిత్యసత్యము శ్రీరామనామము
దట్టమైన గాఢాంధకారమును రూపుమాపును శ్రీరామనామము
పంచభూతాతీతమగు పరమాత్మ తత్త్వము శ్రీరామనామము

పండువెన్నెల కాంతిగలిగిన బ్రహ్మనాదము శ్రీరామనామము
నిజస్వరూపము బోధకంబగు తారకము శ్రీరామనామము
రజతగిరి పతికినెప్పడు రమ్యమైనది శ్రీరామనామము
శివుడు గౌరికి బోధచేసిన చిన్మయము శ్రీరామనామము
సకల సద్గుణ నిలయమగు పరిపూర్ణతత్త్వమే శ్రీరామనామము
అంబరీషుని పూజలకు కైవల్యమొసగిన శ్రీరామనామము
అల కుచేలుని చేతి అటుకుల నారగించిన శ్రీరామనామము
ఆత్మలో జీవాత్మ తానై అలరుచున్నది శ్రీరామనామము
ఆత్మతపమును సల్పువారికి ఆత్మయజ్ఞము శ్రీరామనామము
కర్మనేత్ర ద్వయము చేతను కానరానిది శ్రీరామనామము
జానకీ హృత్కమలమందున నలరుచున్నది శ్రీరామనామము
చిత్తశాంతిని కలుగజేసెడి చిత్స్వరూపము శ్రీరామనామము
చావుపుట్టుకలులేని పరమపదమై వెలయుచున్నది శ్రీరామనామము
ముక్తి రుక్మాంగదన కొసగిన మూలమంత్రము శ్రీరామనామము
మూడునదులను దాటివారికి మోక్షలక్ష్మియే శ్రీరామనామము
మోహమను మంత్రార్థవిదులకు సోమపానము శ్రీరామనామము
చూపు మానస మొక్కటై చూడవలసినది శ్రీరామనామము
త్రిపుట మధ్యము నందు వెలిగే జ్ఞానజ్యోతియే శ్రీరామనామము
దూరదృష్టియు లేనివారికి దుర్లభము శ్రీరామనామము
బంధరహిత విముక్తిపథమగు మూలమంత్రము శ్రీరామనామము
బ్రహ్మపుత్ర కరాబ్జవీణా పక్షమైనది శ్రీరామనామము
భక్తితో ప్రహ్లాదుడడిగిన వరమునొసగెను శ్రీరామనామము
నీలమేఘశ్యామలము నిర్మలము శ్రీరామనామము
ఎందుజూచిన యేకమై తావెలయుచున్నది శ్రీరామనామము
రావణానుజ హృదయపంకజ రాచకీరము శ్రీరామనామము
రామతత్త్వము నెరుగువారికి ముక్తితత్వము శ్రీరామనామము
వేదవాక్య ప్రమాణములచే అలరుచున్నది శ్రీరామనామము
శరణు శరణన విభీషణునకు శరణ మొసగిన శ్రీరామనామము
శాంతి, సత్య, అహింస సమ్మేళనమే శ్రీరామనామము
సోమసూర్యాదులను మించిన స్వప్రకాశము రామనామము
ఉపనిషద్వాక్యములతచేతనే యొప్పచున్నది శ్రీరామనామము
దాసులను రక్షించదయగల ధర్మనామము రామనామము

నాదమే బ్రహ్మాండమంతయు నావరించును రామనామము
రాక్షసులను తరిమికొట్టిన నామమే శ్రీరామనామము
మోక్షమివ్వగ కర్తతానై మ్రోగుచున్నది శ్రీరామనామము
శాంతిగా ప్రార్థించువారికి సౌఖ్యమైనది శ్రీరామనామము
రామనామ స్మరణజేసిన క్షేమమొసగును శ్రీరామనామము
పెద్దలను ప్రేమించువారికి ప్రేమనిచ్చును శ్రీరామనామము
ఆత్మశుద్ధిని గన్నవారికి అధికమధురము శ్రీరామనామము
గుట్టుగా గురుసేవచేసిన గుణములొసగును శ్రీరామనామము
బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు నిష్టమైనది శ్రీరామనామము
పరమపదము చేరుటకు దారిచూపునది శ్రీరామనామము
తల్లివలె రక్షించు సుజనుల నెల్లకాలము శ్రీరామనామము
జ్ఞానులకు ఆత్మానుభవజ్ఞానమే శ్రీరామనామము
మంగళంబగు భక్తితో పాడిన శుభకరంబగు శ్రీరామనామము

**రాం- రామయ నమః**

**ఓం శ్రీరామ జయ రామ**

**జయ జయ రామ!**

## జయమంత్రం

(ఏదైనా కార్యం మొదలు పెట్టేప్పుడు ఈ మంత్రం చదివితే వారికి అపజయమే కలుగదు. ఇది నిజంగా ఎందరో పెద్దలకు అనుభవమయ్యింది. హనుమంతుడు సుందరకాండలో పలికినది)

**జయ త్యతిబలో రామో లక్ష్మణ శ్చ మహాబలః**
**రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః**
**దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః**
**హనుమాన్ శత్రు సైన్యానాం నిహంతా మారుతాత్మజః**
**న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్**
**శిలాభి స్తు ప్రహరతః పాదపై శ్చ సహస్రశః**
**అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీం**
**సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్.**